ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 29.0
కనిష్ఠం : 25.0



మెరిట్ విద్యార్థులకు సొంత నిధులతో ప్రోత్సాహం : మంత్రి సారథి



నూజివీడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో మంచి మెరిట్ సాధించి ఐఐటీలో సీట్లు సాధించే నూజివీడు నియోజకవర్గం లోని ప్రతీ విద్యార్థికి తన సొంత నిధులతో ఉన్నత విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందిస్తానని మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం నూజివీడులో ప్రకటించారు. నూజివీడులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ ఎస్టీ విద్యార్థులకు రూ.లక్ష రూపాయలు, ఎస్సీ విద్యార్థులకు రూ.75,000, బీసీ విద్యార్థులకు రూ.50,000, ఓసీ విద్యార్థులకు రూ.25 వేలు చొప్పున వారి విద్యాభివృద్ధి కోసం ఆర్థిక సాయం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.



కలపర్రు టోల్‌గేటు వద్ద బ్రీత్ ఎనలైజర్లతో తనిఖీలు చేస్తున్న పోలీసులు

విస్తృతంగా వాహనాల తనిఖీలు

ఏలూరు క్రైం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఇచ్చిన ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆదివారం సాయంత్రం విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలకు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు, వ్యాపారులకు అధికారులు సూచించారు. వాహనాల తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. సరైన రికార్డులు లేనివారికి జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహనాలను నడుపుతున్న మైనర్లను ఆపి వారికి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెద్దింట్లమ్మకు పాలపొంగళ్లు

కైకలూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి):కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని పాలపొంగళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి రావడంతో అలయ ఆవరణ కిక్కిరిసింది. భక్తులు కోళ్ళు, గొర్రె పొట్టేళ్లు మొక్కుబడులుగా చెల్లించుకున్నారు. మహిళలు ఆలయ ఆవరణలో పాలపొంగళ్ళను పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద విశేషపూజలను జరిపారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు మంచినీటి సదుపాయాన్ని కల్పించారు.

కొల్లేరు సరస్సు నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి సాఫీగా వెళ్లేందుకు అడ్డుగా ఆక్రమణలు, ఉప్పుటేరుపై రైల్వే వంతెన పెద్ద సమస్యగా మారాయి. వీటితో పాటు గుర్రపుడెక్క, తూడు, కిక్కిస నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. గతంలో 247 మీటర్ల వెడల్పున ఉన్న ఉప్పుటేరు ప్రస్తుతం 80 మీటర్లకు కుచించుకుపోవడంతో ముంపు సమస్య ఏర్పడుతోంది. ప్రభుత్వం ఉప్పుటేరు ప్రక్షాళనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, లేదంటే ఏటా వరదల బారిన పడక తప్పదని కొల్లేరు వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలు.. అడ్డంకులు!

కొల్లేరు ,ఉప్పుటేరు చిక్కి శల్యం



ఉప్పుటేరులో నీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్నరైల్వే బ్రిడ్జి పిల్లర్లు, అడ్డుగా ఉన్న కిక్కిస

- అవగాహన లోపంతో రైల్వేబ్రిడ్జి నిర్మాణం
- వంతెనల వద్ద పూడుకుపోయిన కానాలు
- తూడు, గుర్రపుడెక్క కిక్కిసతో సమస్య
- దిగువకు నీటి ప్రవాహానికి అవరోధం
- ప్రక్షాళన లేకపోతే తప్పని ముంపు

కైకలూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): కొల్లేరు సరస్సులో ఏటా వర్షాకాలం వేల క్యూసెక్కుల నీరు చేరుతుంది. ఈ నీరు సముద్రంలోకి వెళ్లేందుకు ఏకైక మార్గం ఉప్పుటేరు పరివాహక ప్రాంతం. సుమారు 43 కిలోమీటర్ల పొడవున 80 మీటర్ల వెడల్పున ఉప్పుటేరు విస్తరించి ఉంది. ఉప్పుటేరు కొల్లేరు గర్భంలో ప్రారంభమై కైకలూరు, ఆకివీడు, కాళ్ళ, కలిదిండి, కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. అయితే ఉప్పుటేరుకు ఎక్కడ చూసినా ఆక్రమణలే.. వరదలు వస్తే నెలల తరబడి గ్రామాలకు గ్రామాలే నీటిలో నానుతుంటాయి. ఆక్రమణలు తొలగించడంలో అధికారులు ఉదాసీనత వైఖరితో ముంపునకు గురవుతున్నాయి. ఉమ్మడి కృష్ణా పశ్చిమగోదావరి జిల్లాలోని రామిలేరు, తమ్మిలేరు, బుడమేరు వంటి మేజర్ డ్రెయిన్లతో కలిపి 66 మేజర్, మైనర్ డ్రెయిన్లు, కాల్వల నుంచి వేల క్యూసెక్కుల నీరు కొల్లేరు సరస్సులోకి చేరుతుంది. గతంలో కొల్లేరు సరస్సులో 10 వేల క్యూసెక్కుల నీరు నిల్వ ఉంటుందని అధికారులు అంచనా వేసేవారు. అప్పట్లో ఉప్పుటేరు 247 మీటర్ల వెడల్పున ఉండడంతో నీరు నేరుగా సముద్రంలోకి వెళ్లేది. రానురాను ఉప్పుటేరు ఇరువైపులా ఆక్రమణలకు గురై ప్రస్తుతం 80 మీటర్లకు కుచించుకుపోయింది. ఉప్పుటేరుకు ఇరువైపులా చేపల, రొయ్యల చెరువులను తవ్వకాలు చేసి ఆక్రమణలకు పాల్పడడంతో నీటి ప్రవాహానికి అవరోధంగా మారింది.

రైల్వే అధికారుల అవగాహన లోపం..

ఉప్పుటేరుపై రైల్వేడబ్లింగ్ నిర్మాణ పనుల్లో రెండో వంతెనను నూతనంగా నిర్మాణం చేశారు. రైల్వే అధికారుల అవగాహన లోపమో, నిర్లక్ష్యమో తెలి యదుగానీ అడ్డదిడ్డంగా ఉప్పుటేరు లో బ్రిడ్జి పిల్లర్ల నిర్మాణంతో నీటి ప్రవాహానికి పెద్దముప్పే ఏర్పడింది. భారీ కాలమ్స్ నిర్మాణం చేశారు. ఒక్కొక్క కాలమ్ 10 మీటర్ల వెడల్పున 8 పిల్లర్లను నిర్మించారు. వీటి మధ్యన 10 గజాలు దూరం కూడా లేకపోవడంతో నీటి ప్రవాహానికి అవరోధంగా మారింది. ఈ పిల్లర్ల వద్ద దట్టంగా గుర్రపుడెక్క, కిక్కిస, తూడు అలుముకోవడంతో వంతెన దిగువ భాగానికి నీరు ప్రవహించడం లేదు. దీంతో ఎగువన ఉన్న కొల్లేరు గ్రామాలతో పాటు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అనేక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. గతంలో ఉప్పుటేరుపై నిర్మాణం చేసిన రైల్వే వంతెనకు పిల్లర్‌కు పిల్లర్‌కు మధ్యన 30 గజాలు వెడల్పు ఉండడంతో నీరు కిందకి పారుదల అయ్యేది. నూతనంగా నిర్మాణం చేసిన వంతెనలో భారీ పైపులను రైల్వే అధికారులు వదిలివేశారు. వీటి వల్ల కూడా గుర్రపుడెక్క, తూడు కిందకి వెళ్లకుండా నీటిప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. వంతెన ఎగువ భాగాన ఉప్పుటేరును పూర్తిగా గుర్రపుడెక్క, కిక్కిస కమ్మేసింది.



కైకలూరు మండలం కొట్టాడలో ఉప్పుటేరును ఆక్రమించి తవ్విన రొయ్యల చెరువు

ముఖ్యమంత్రి దృష్టికి సమస్య

ఉప్పుటేరుపై ఆక్రమణలు, రైల్వేబ్రిడ్జ్ నిర్మాణం వల్ల కలిగే అనర్థాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి దృష్టికి కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు తీసుకువెళ్లారు. దీనిపైన ముఖ్యమంత్రి స్పందిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి, రైల్వే ఉన్నతా ధికారులతో చర్చించి ఉప్పుటేరులో నీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్న బ్రిడ్జి పరిస్థితులను వివరించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పేరుకుపోయిన మట్టి, కిక్కిస

కైకలూరు-ఏలూరు ఆర్అండ్‌బీ రహదారిలో పెద్ద, చిన్నఎడ్లగాడి వంతెనల వద్ద కొల్లేరు సరస్సులో వంతెన కానాల నుంచి సరస్సు దిగువకు నీరు పారుదల అవుతుంది. ఈ వంతెనల వద్ద 10 అడుగుల ఎత్తున ఖాళీగా ఉండేది. నీటి ప్రవాహంతో వంతెన దిగువ భాగాన దట్టంగా మట్టి చెత్తాచెదారం పేరుకుపోవడంతో ప్రస్తుతం మూడు నుంచి (మిగతా 8వ పేజీలో)



పరీక్ష సెంటర్ మార్పు దుర్మార్గం

- పెనుగొండ ఎస్వీకేపీ కళాశాల వద్ద నిరసన తెలిపిన అభ్యర్థులు

■ లోపలి పేజీలో..

పీ-4 మార్గదర్శుల కోసం టీచర్లపై ఒత్తిడి తగదు

- పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి, ఫ్యాప్టో సభ్యులు

టీడీపీ ప్రభుత్వం మరో నిర్ణయం

దివ్యాంగులకు.. ఉచిత వాహన యోగం

- నియోజకవర్గానికి పది చొప్పున పంపిణీ
- త్వరలో దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు ఇంధన రాయితీ, శాశ్వత గుర్తింపు కార్డులు అందజేసిన టీడీపీ ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. వారికి నూరుశాతం రాయితీతో మూడు చక్రాల వాహనాలు (రెట్రోఫిటెడ్ వాహనాలు) అందించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి దరఖాస్తులు స్వీకరణ త్వరలోనే ప్రారంభమవుతుందని విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారులు చెబుతున్నారు. అర్హుల జాబితాను తయారు చేసి త్వరితగతిన వాహనాలు అందజేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. గతంలో దివ్యాంగులకు ఇంధన రాయితీ కల్పించిన ప్రభుత్వం మరోసారి రూ.లక్ష విలువ కలిగిన వాహనాలను ఉచితంగా అందజేస్తారని ప్రకటన వెలువడడంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ వాహనాలు అందజేసింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల కాలంలో ఒక్కసారే పంపిణీ చేశారు. ఎన్నికల హామీలో భాగంగా సీఎం చంద్రబాబు పెన్షన్ పెంచడం, ఆ తర్వాత ఇంధన రాయితీ, ఇప్పుడు రూ.లక్ష విలువ చేసే వాహనాలను అందించడం ఆనందంగా ఉందంటూ దివ్యాంగులు హర్షం ప్రకటించారు.

త్వరలో దరఖాస్తులను స్వీకరిస్తాం..



ప్రభుత్వం తీసుకువస్తున్న ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి. త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తాం. ప్రభుత్వ ఆదేశాలు అందగానే దరఖాస్తులు స్వీకరిస్తాం. అర్హులను ఎంపిక చేసి, వీలైనంత త్వరలోనే వాహనాలను పంపిణీ చేస్తాం.

- రాజ్‌కుమార్, ఏడీ, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ జిల్లాశాఖ



దివ్యాంగులకు అందించే వాహనం

సమర్పించాల్సిన పత్రాలు ఇవే..

దరఖాస్తుతో పాటు వైకల్యం 70శాతం నిర్ధారించే సదరం సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, పదో తరగతి సర్టిఫికెట్, బ్యాంక్ వివరాలు, ఆధార్, రేషన్ కార్డులు, వ్యాపారం, లేదా ఏదైనా సంస్థలో పనిచేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రంతో జిల్లాలోని వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ కార్యాలయంలో అందజేయాలి.

అర్హులెవరు..

మూడు చక్రాల వాహనాల పంపిణీకి దివ్యాంగులకు గల అర్హతలను ఇప్పటికే ప్రభుత్వం నిర్ధారించింది. డిగ్రీ ఆపై ఉన్న విద్య అభ్యసించే విద్యార్థులకు, స్వయం ఉపాధి రంగంలో ఉన్నవారికి తొలి ప్రాధాన్యత ఇస్తారు. 18-45 ఏళ్ల మధ్య వయస్సు ఉండి 70 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు దీనికి అర్హులు.

నియోజకవర్గానికి పది వాహనాలు

తొలి దశలో నియోజకవర్గానికి పది చొప్పున వాహనాలు అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని ఏటా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటుంది. స్వచ్ఛంద సంస్థల ద్వారా మరికొంత మందికి వీటిని అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. దీంతో ప్రతీ లబ్ధిదారునికి వాహనం అందుతుందని అధికారులు చెబుతున్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల నమోదు..

అన్నీ చిక్కులే!

- ఓటీపీ సేకరణలో ఉపాధ్యాయులకు ఇబ్బందులు

ముదినేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీకి సంబంధించిన అంశాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ఉపాధ్యాయులకు తలనొప్పి వ్యవహారంలా పరిణమించింది. ఈ నమోదు ప్రక్రియలో పలు చిక్కులు ఎదురవడమే కాక చికాకులు కలిగిస్తోంది. విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు అందినట్లు వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేసి ఓటీపీ నంబర్లను తెలుసుకుని ఆ నంబర్లను లీప్ యాప్‌లో నమోదు చేయాలి. విద్యార్థుల తల్లిదండ్రులు ఓటీపీ నంబరు చెప్పగలగాలి. ఈ ప్రక్రియలో ఎక్కడ తప్పు జరిగినా తిరిగి లీప్ యాప్‌లోకి వెళ్లి యూజర్ నేమ్, పాస్ వర్డ్ ఎంటర్ చేసి మళ్లీ ఫోన్ చేయాలి. ఓటీపీ చెప్పడం అత్యధిక శాతం తల్లిదండ్రులకు తెలియదు. కొంతమంది ఇళ్ల వద్ద ఫోన్లు ఉంచి వ్యవసాయ పనులకు వెళ్లిపోతున్నారు. దీంతో ఉపాధ్యాయులు ఎంత ప్రయత్నించినా తల్లిదండ్రుల నుంచి రాబట్టడం కష్టంగా మారింది. ఇదంతా ఒక ఎత్తయితే ఎక్కువ మంది తల్లిదండ్రులు ఓటీపీలు చెప్పేందుకు భయపడుతున్నారు. ఇటీవల కాలంలో వాయిస్ మెస్సేజ్‌ల ద్వారా ఫోన్లలో బ్యాంకుల నుంచి కానీ, అధికారులమని కానీ ఎవరు ఫోన్ చేసి అడిగినా ఓటీపీలు చెప్పవద్దు, అది మీ బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేసే పన్నాగం కావొచ్చునన్న హెచ్చరికలు వస్తుండటంతో, ఇప్పుడు తమకు నిత్యం కనిపించే ఉపాధ్యాయులు ఫోన్ చేసి ఓటీపీ అడిగినా చాలామంది తల్లిదండ్రులు చెప్పేందుకు నిరాకరిస్తున్నారు. ముదినేపల్లి మండలంలో సుమారు 4 వేల మంది విద్యార్థులకు విద్యార్థి కిట్లను అందజేసినట్టు నమోదు చేయాల్సి ఉండగా, గత వారం రోజులుగా 60 శాతం కూడా పూర్తి కాలేదు. ఓటీపీ బదులు బయో మెట్రిక్ విధానం అమలు చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.



విద్యార్థి మిత్ర యాప్



కుక్కునూరు తీరంలో గోదావరి

నెమ్మదిగా తగ్గుతున్న గోదావరి

కుక్కునూరు/ పోలవరం/వేలేరుపాడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం నెమ్మదిగా తగ్గుతుంది. శని వారం రాత్రి 11గంటలకు 35.40 అడుగుల నీటిమట్టం నమోదైంది. అనంతరం నెమ్మదిగా పెరుగుతూ ఆదివారం ఉదయానికి 35.60 అడుగుల నీటిమట్టానికి పెరిగింది. అనంతరం ఎగువ నుంచి గోదావరి వరద లేకపోవడంతో నెమ్మదిగా తగ్గుతూ సాయంత్రానికి 34.60 అడుగుల నీటిమట్టానికి తగ్గింది. 5లక్షల 86వేల క్యూసెక్కుల వరదనీరు దిగువకు విడుదలవుతుంది. గోదావరి ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడం కారణంగా వరద క్రమేపి తగ్గి సోమవారం ఉదయానికి మరికొంత తగ్గే అవకాశాలున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా కుక్కునూరు, దాచారం మధ్య గుండేటివాగు లోలేవెల్ కాజ్‌వే ఇంకా ముంపు లోనే ఉంది. దీంతో రాకపోకలు నల్లగుంట మీదుగా సాగుతు న్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు రెండుసార్లు గోదావరి వరద లకు ఈ కాజ్‌వే నీటమునిగింది. గోదావరి తీరం వైపు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని గోదావరి తీర గ్రామాల్లో అధికారులు హెచ్చరిస్తున్నా రు. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంతో వరదనీటిలో మునిగిన ఎద్దువాగు వంతెన ఇంకా బయటపడలేదు. దీంతో 15 గ్రామాల ప్రజలు ఎద్దువాగు పై ఏర్పాటు చేసుకున్న నాటుపడవ ద్వారానే రాకపోకలు సాగిస్తున్నారు. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంతో మరో రెండు, మూడురోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది. పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం కాస్తా పెరిగింది.

పంటల బీమాకు

దరఖాస్తులు అంతంతే!



- వరికి ఆగస్టు 15 వరకు, మినుము పంటకు ఈ నెలాఖరు వరకు అవకాశం
- పత్తి ,నిమ్మ పంటలకు ఇప్పటికే ముగిసిన గడువు
- జిల్లా వ్యాప్తంగా అందిన 611 దరఖాస్తులు
- రైతుల్లో కానరాని స్పందన

ఏలూరుసిటీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి):ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు దెబ్బతిన్న సమయంలో పంటల బీమా పథకంలో బీమా చెల్లించిన వారికి ఆర్థికంగా భరోసా లభిస్తుంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి గడువు ముగుస్తున్నా అంతంత మాత్రంగానే దరఖాస్తులు వచ్చాయి. జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలను పరిశీలిస్తే ఇప్పటివరకు 186.6 హెక్టార్లకు సంబంధించి 611 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇందులో రుణాలు పొందిన వారు 176 మంది, రుణాలు పొందని వారు 435 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు దరఖాస్తు చేసుకోవాలని ఇప్పటికే మండలాల్లో వ్యవసాయ శాఖాధికారులు రైతుల్లో అవగాహన కల్పించారు. అయినా రైతుల్లో అంతంత మాత్రంగానే స్పందన కనిపిస్తోంది.

జిల్లాలో సార్వా 2025 వరి పంటకు గ్రామ యూనిట్‌గా, మినుము పంటకు జిల్లా యూనిట్‌గా, పత్తి, నిమ్మ పంటలకు గ్రామం యూనిట్‌గా అమలు చేస్తున్నారు. బ్యాంకులో రుణం పొందే రైతులు, రుణాలు పొందని రైతులు, సొంత భూమి, కౌలుదారులు, రుణ అర్హత గుర్తింపు కార్డు కలిగిన రైతులు అర్హులుగా పేర్కొన్నారు. వరి పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రూ.840 రైతు ప్రీమియం కాగా ఆగస్టు 15వ తేదీ నమోదుకు చివరి తేదీ. మినుము పంటకు రూ.300 రైతు ప్రీమియం కాగా నమోదు చేసుకోవడానికి జూలై 31 చివరి తేదీగా ప్రకటించారు. పత్తి పంటకు ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ (వాతావరణ ఆధారిత పంటల బీమా) కింద రూ.1900 రైతు ప్రీమియం కాగా జూలై 15వ తేదీ తుది గడువుగా పేర్కొన్నారు. నిమ్మ పంట కు అర్‌డబ్ల్యూబీసీ ఇన్సూరెన్స్ స్కీం కింద రూ.2500 రైతు ప్రీమియంగా, నమోదుకు జూలై 15వ తేదీ తుది గడువుగా పేర్కొన్నారు. దరఖాస్తు పారం పూర్తి చేసి ఆధార్ నకలు, బ్యాంకు ఖాతా వివరాలు, బ్యాంకు పాస్‌బుక్ నకలు, కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్‌సీ కార్డు నకలు, రుణం తీసుకొనని సొంత రైతులు తప్పనిసరిగా పట్టాదార్ పాస్‌పుస్తకం నకలు, పంట ధ్రువీకరణ పత్రం జతపరచాలి. రుణం పొందిన రైతులకు బ్యాంకు ప్రతినిధులు ప్రీమియం తగ్గించి రుణం మంజూరు చేస్తారు. రుణం పొందని (మిగతా 8వ పేజీలో)

జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు 611

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకాలకు సంబంధించి మొత్తం 611 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజనకు సంబం ధించి 594, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్‌కు సంబంధించి 17 దర ఖాస్తులు వచ్చాయి. పత్తి, నిమ్మ పంటలకు సంబంధించి ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకానికి ఈనెల 15వ తేదీతో గడువు ముగిసింది. ఈ పథకానికి సంబంధించి కుక్కునూరు, కామ వరపుకోట, ద్వారకా తిరుమల, ఆగిరిపల్లి మండలాల్లో 4 ఇన్సూరెన్స్ యూనిట్లుకు సంబంధించి ఐదుగురు రైతులు దరఖాస్తు చేసుకున్నారు.

- ఇక ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనకు సంబంధించి వరి పంటకు ఆగస్టు 15వ తేదీ వరకు, మినుము పంటకు సంబంధించి ఈనెలాఖరు వరకు తుది గడువు ఉంది. వరి, మినుము పంటలకు సంబంధించి జిల్లాలోని మండవల్లి, ఆగిరిపల్లి, ముదినేపల్లి, ఉంగుటూరు, ఏలూరు, చాట్రాయి, భీమడోలు, దెందులూరు, కొయ్యలగూడెం, లింగపాలెం, జంగారెడ్డిగూడెం, పెదపాడు, నూజివీడు, నిడమర్రు, ముసునూరు, బుట్టాయిగూడెం, చింతలపూడి, కామవరపుకోట, టి.నర్సాపురం, పెదవేగి, కలిదిండి, పోలవరం, జీలుగుమిల్లి మండలాలకు సంబంధించి 164 ఇన్సూరెన్స్ యూనిట్లు కాగా మొత్తం 435 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు.

దిక్సూచి

సైబర్ సెక్యూరిటీ & సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఐఐటీ బాంబే సర్టిఫికెట్ ప్రోగ్రామ్

సైబర్ సెక్యూరిటీ & సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌పై ఐఐటీ బాంబే ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. పన్నెండు నెలల ఈ కోర్సును పూర్తిగా ఆన్‌లైన్‌లో అందిస్తున్నారు. పరీక్షలు ఐఐటీ క్యాంపస్‌లో నిర్వహిస్తారు. ఇది పూర్తిగా వర్కింగ్ ప్రొఫెషనల్స్, కాలేజీ ఫ్యాకల్టీలతోపాటు ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులను ఉద్దేశించి రూపొందించారు. 2025 సెప్టెంబర్ 1 నుంచి కోర్సు ప్రారంభం కానుంది. పూర్తి వివరాల కోసం ఐఐటీ బాంబే వెబ్‌సైట్ చూడవచ్చు.

ఐబీపీఎస్ పీవో, ఎస్ఓ దరఖాస్తుల గడువు జూలై 28

ప్రొబెషనరీ ఆఫీసర్, స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల దరఖాస్తు దాఖలు గడువును ఐబీపీఎస్ పొడిగించింది. ఆసక్తిగల అభ్యర్థులు 2025 జూలై 28లోపు ibps.in. వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.



ఎన్ఐఆర్‌డీలో పీజీ డిప్లొమా

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ & పంచాయతీ రాజ్'(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ట్రైబల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్(పీజీడీటీడీఎమ్), ప్రోగ్రామ్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి దూరవిద్యలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నారు. మొత్తం మూడు సెమిస్టర్లు ఉంటాయి. మూడో సెమిస్టర్ పూర్తిగా ప్రాజెక్ట్ వర్క్ ఉంటుంది.

కోర్సు కాలవ్యవధి: 18 నెలలు

అర్హత: గుర్తింపు పొందిన వర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ పాసై ఉండాలి.

కోర్సు ఫీజు: రూ.18,200/-(ఎస్సీ/ఎస్టీలకు ఫీజులో కొంత మేరకు మినహాయింపు ఉంటుంది)

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 31

ఫోన్: 040 24008442, 7416860345,

Email: dec.nird@gov.in.

వెబ్‌సైట్: www.nirdpr.org.in

మ్యాట్ 2025 సెప్టెంబర్ సీజన్

సీబీటీ & పీబీటీ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 'మ్యాట్ 2025' సెప్టెంబర్ సీజన్ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. జాతీయ స్థాయిలో మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అడ్మిషన్లకు ఉద్దేశించిన ప్రధాన ఎంట్రెన్స్‌ల్లో 'ద మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్'(మ్యాట్) ఒకటి. ఈ ఎంట్రెన్స్‌ను 1988 నుంచి నిర్వహిస్తున్నారు. 2003 నుంచి కేంద్ర విద్యామంత్రిత్వశాఖ దీనిని జాతీయ స్థాయి పరీక్షగా గుర్తించింది. ఇది పేపర్ బేస్డ్ టెస్ట్(పీబీటీ), కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) మోడల్‌లో ఉంటుంది. ప్రస్తుతం ఈ రెండు మోడల్స్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయ్యాయి. అభ్యర్థులు తమ సౌకర్యాన్ని, ఆసక్తినిబట్టి ఈ రెంటిలో ఒకటి కానీ, రెంటినీ కానీ ఎంచుకోవచ్చు. మ్యాట్ స్కోరు వ్యాలిడిటీ ఒక సంవత్సరం ఉంటుంది. దేశవ్యాప్తంగా 600 పైగా బిజినెస్ స్కూల్స్ ఈ స్కోరు ద్వారా అడ్మిషన్ కల్పిస్తాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం ఉన్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేయవచ్చు. అయితే కౌన్సెలింగ్ సమయంలోపు సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

పరీక్ష విధానం: మ్యాట్ ఎంట్రెన్స్ నిర్దిష్ట సమయం రెండు గంటలు. ఇందులో ఐదు సెక్షన్లు ఉంటాయి. ప్రతీ సెక్షన్‌లో ముప్పై ప్రశ్నలు అంటే మొత్తం 150 ప్రశ్నలు ఉంటాయి. ఈ ఎంట్రెన్స్‌లో నెగెటివ్ మార్కింగ్ ఉంది. తప్పుగా గుర్తించిన ప్రతీ సమాధానికి పావు మార్కు తగ్గిస్తారు.

- లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ 30
- ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్ 30
- మేథమెటికల్ స్కిల్స్ 30
- డేటా అనాలిసిస్ అండ్ సఫిసియన్సీ 30
- ఎకనామిక్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ 30

పీబీటీ ఎగ్జామ్

- పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్ 21
- రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 15
- హాల్ టికెట్ల విడుదల: 2025 సెప్టెంబర్ 18


సీబీటీ ఎగ్జామ్

- పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్ 28
- రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 22
- హాల్ టికెట్ల విడుదల: 2025 సెప్టెంబర్ 25

ఫీజు: పీబీటీ లేదా సీబీటీల్లో ఏదో ఒకటే రాయాలనుకున్న అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు రూ.2200/-. రెండు ఎంట్రెన్స్‌లు రాయాలనుకున్న అభ్యర్థులు అదనంగా రూ.1600/- చెల్లించాల్సి ఉంటుంది.

ఫలితాలు: 2025 అక్టోబర్ రెండోవారంలో విడుదల చేస్తారు.

వెబ్‌సైట్: mat.aima.in



ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2026

'ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ - 2026' నోటిఫికేషన్‌ను ఢిల్లీలోని 'ద నేషనల్ లా యూనివర్సిటీ' విడుదల చేసింది. ఐదు సంవత్సరాల బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్, బ్యాచిలర్ ఆఫ్ లా(బీఏ ఎల్ఎల్‌బీ)(ఆనర్స్), ఒక సంవత్సరం మాస్టర్ ఆఫ్ లా(ఎల్ఎల్ఎం) ప్రోగ్రామ్‌లకు సంబంధించిన ఈ ఎంట్రెన్స్ పరీక్ష 2025 డిసెంబర్ 14న జరుగుతుంది. ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీలో అడ్మిషన్ కోసం ఏఐఎల్ఈటీ స్కోరును మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ('క్లాట్', 'ఎల్‌శాట్'తో ఇక్కడ అడ్మిషన్ లభించదు).

విద్యార్హత: ఐదు సంవత్సరాల కోర్సుకు దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్మీడియేట్ పూర్తి చేసి ఉండాలి. ఓబీసీలకు 42, ఎస్సీ/ఎస్టీలకు 40 శాతం మార్కులు ఉంటే సరిపోతుంది.

వయస్సు: ఏఐఎల్ఈటీ ప్రోగ్రామ్‌లో చేరడానికి ఎలాంటి గరిష్ఠ, కనిష్ఠ వయస్సు నిబంధనలు లేవు.

పరీక్ష విధానం: మొత్తం మూడు సెక్షన్లతో 150 మార్కులు, 150 ప్రశ్నలతో ప్రశ్నపత్రం ఉంటుంది. నిర్దిష్ట సమయం రెండు గంటలు. ఇందులో నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా గుర్తించిన ప్రతీ సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు.

సెక్షన్ ఏ: ఇంగ్లిష్ లాంగ్వేజ్ - 50 మార్కులు - 50 ప్రశ్నలు

సెక్షన్ బి: కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ - 30 మార్కులు - 30 ప్రశ్నలు

సెక్షన్ సి: లాజికల్ రీజనింగ్ - 70 మార్కులు - 70 ప్రశ్నలు

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు 3500/-. ఎస్సీ/ఎస్టీ, ఆర్థికంగా వెనకబడిన అభ్యర్థులకు 1500/-. 2025 ఆగస్ట్ 7 నుంచి 2025 నవంబర్ 10లోపు ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు ఏఐఎల్‌టీఈ 2026 కోసం nationallawuniversitydelhi.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ పరీక్ష కేంద్రాలు తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నంలో ఉన్నాయి.

చిరునామా: National Law University, Delhi, Sector-14, Dwaraka, New Delhi - 110078, India, 011- 40787555
(10:00 am to 05:00 pm on all working days)
ailetsupport@nludelhi.ac.in

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఏపీ ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీస్‌లోని 100 ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025 ఆగస్ట్ 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. రాత పరీక్ష, శారీరక పరీక్ష, సీపీటీ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్నవారికి బోనస్ మార్కులు ఉంటాయి.

పోస్టు: ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్(ఎఫ్ఎస్ఓ). మొత్తం 100 పోస్టులు ఉన్నాయి.

వయస్సు: 2025 జూలై 1 నాటికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

అర్హత: పోస్టులను అనుసరించి డిగ్రీ ఉండాలి. (బోటనీ, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, స్టాటిస్టిక్స్, జియాలజీ, కెమికల్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్)

శారీరక ప్రమాణాలు:

పురుషులు: కనీసం 163 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి. ఛాతి 84 సెంటీ మీటర్లు ఉండాలి. గాలి పీల్చినప్పుడు కనీసం ఐదు సెంటీమీటర్లు పెరగాలి.

స్త్రీలు: కనీసం 150 సెంటీ మీటర్ల ఎత్తు ఉండాలి. ఛాతి 79 సెంటీమీటర్లు ఉండాలి. గాలి పీల్చినప్పుడు 5 సెంటీ మీటర్లు పెరగాలి.

నడక: పురుషులు నాలుగు గంటల్లో 25 కిలో మీటర్లు నడవాలి. మహిళలు 16 కిలో మీటర్లు నడవాలి.

చివరి తేదీ: 2025 ఆగస్ట్ 17 **వెబ్‌సైట్:** portalpsc.ap.gov.in/

SCHOLARSHIP ALERT

Aspire Scholarship Program

Description: Aspire Scholarship Program 2025-26 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Mr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first year of B.Tech courses at any of the specified 11 institutions can apply.

- The annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: A total of 28 beneficiaries will be awarded scholarships based on the actual fee structure.

- The scholarship fund will be provided for academic expenses such as tuition fees, hostel fees, food, and related expenses.
- The duration of the scholarship will be 4 years, subject to meeting the specified criteria for yearly renewal.

Last Date to Apply: 31-08-2025

Application: Online Only ***Short Url:*** www.b4s.in/aj/ASPI4

HDFC Bank Parivartan's ECSS Programme

Description: HDFC Bank invites applications from students in Classes 1 to postgraduate level for the ECSS Scholarship 2025-26. This program supports meritorious and underprivileged students from financially challenged backgrounds.

Eligibility: Open to Indian nationals only

- Students in Classes 1–12, diploma, ITI, polytechnic, undergraduate, and postgraduate (general and professional) courses
- Minimum 55% marks in the last qualifying exam
- Annual family income must be INR 2.5 lakh or less
- Preference for students who have faced personal or family crises in the past three years, affecting their ability to continue education

Prizes & Rewards: Up to INR 75,000 ***Last Date:*** 04-09-2025

Application: Online only ***Short Url:*** www.b4s.in/aj/HDFC57

buddy4study.com



చిత్రజ్యోతి

SINCE 1965

'మైసా'గా రష్మిక



రష్మిక మందన్న కొత్త చిత్రం 'మైసా' ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సినిమాతో రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నిర్మాత డి.సురేశ్ బాబు క్లాప్ కొట్టారు. రవి కిరణ్ కోలా కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు హను రాఘవపూడి స్క్రిప్ట్‌ను మేకర్స్‌కి అందజేసి, ముహూర్తపు షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. రష్మిక 'మైసా' అనే శక్తిమంతమైన, హీరోయిన్ ఓరియెంటెడ్ పాత్రలో కనిపించబోతున్నారు. కాగా, గోండు తెగల బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ సోమవారం నుంచి హైదరాబాద్‌లో ప్రారంభమవుతుందని, మొదటి షెడ్యూల్‌లో రష్మిక పాల్గొంటుందని చిత్రబృందం పేర్కొంది.

ఉత్కంఠభరిత చిత్రం



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా 'కామాఖ్య'. పూజా కార్యక్రమాలతో ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. షై ఫిల్మ్ ప్రొడక్షన్స్ బేనర్‌పై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ నిర్మిస్తున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. చిత్ర దర్శకుడు అభినయ కృష్ణ ఈ సినిమా కోసం ఉత్కంఠభరితమైన కథని సిద్ధం చేశారని మేకర్స్ తెలిపారు. ఆనంద్, శరణ్య, ప్రదీప్, వైష్ణవ్, ధన్‌రాజ్, రాఘవ, ఐశ్వర్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

కొత్త పాత్రలో..



వరుణ్ సందేశ్ హీరోగా ఏ.పళని స్వామి తెరకెక్కించనున్న 'వన్ వే టికెట్' అనే సినిమా పూజా కార్యక్రమాలతో ఆదివారం ప్రారంభమైంది. బొరిగె శ్రీనివాస రావు నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో నిర్మాత సి.కల్యాణ్, దర్శకుడు త్రినాధరావు నక్కిన, సంగీత దర్శకుడు సాయి కార్తిక్, నటి కుష్బూ చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ 'ఈ స్క్రిప్ట్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. నేను ఇందులో కొత్త పాత్రను పోషించబోతున్నాను' అని అన్నారు. చిత్ర దర్శకుడు పళని స్వామి మాట్లాడుతూ 'ఈ సినిమా క్రైమ్ థ్రిల్లర్‌గా రాబోతోంది' అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరామెన్: శ్రీనివాస్ బెజుగమ్, సంగీతం: సాయి కార్తీక్.





'సుపరిపాలనలో తొలి అడుగు'లో
'గోపాలపురం నియోజకవర్గం' ఫస్ట్

ద్వారకాతిరుమల, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గోపాలపురం నియోజకవర్గం ప్రథమస్థానంలో ఉంది. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సారథ్యంలో నియోజవర్గనేతలు, కార్యకర్తలు బూత్, క్లస్టర్ సభ్యులు చురుకుగా కార్యక్రమంలో పాల్గొని నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపారు. గత పాలనలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు తెలపడంలో ఎమ్మెల్యే వెంకట్రాజు పైచేయి సాధించారు. మొత్తం 15 నియోజకవర్గాల్లో గోపాలపురం నియోజకవర్గంలో 81,168 ఇళ్లల్లో తొలి అడుగు కార్యక్రమాన్ని పూర్తి చేసి మొదటిస్థానంలో ఉన్నట్టు ఎమ్మెల్యే వెంకట్రాజు తెలిపారు. ఈ క్రమంలో 78,078 ఇళ్లు పూర్తిచేసి ఉండి నియోజకవర్గం ద్వితీయ, 74,052 ఇళ్లు పూర్తి చేసి తణుకు తృతీయ స్థానం. 64,077 ఇళ్లు పూర్తి చేసి ఏలూరు నియోజకవర్గం ఆరో స్థానం. 20,993 ఇళ్లు పూర్తి చేసి నిడదవోలు చివరి స్థానంలో ఉంది. ద్వారకాతిరుమల మండలంలో 24,639 ఇళ్లు తిరగాల్సి ఉండగా 19,678 ఇళ్లు తిరిగి 80 శాతం పూర్తి చేశారు.

అధికార లాంఛనాలతో డీఎస్పీ అంత్యక్రియలు


డీఎస్పీ భార్య కిరణ్మయిని ఓదార్చుతున్న కలెక్టర్ నాగరాణి

పాలకొల్లు టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన పాలకొల్లు పట్టణానికి చెందిన ఇంటెలిజెన్స్ డీఎస్పీ మేక చక్రధరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం శనివారం రాత్రి పాలకొల్లుకు చేరుకుంది. ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సి.నాగరాణి ఆయన నివాసాన్ని సందర్శించి భార్య కిరణ్మయిని, కుమార్తెలు హాసినీప్రియ, డింపుల్‌లను, కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని అన్ని విధాలా అదుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ నయీం అస్మి, ఆర్డీవో దాసి రాజు, తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, తెలంగాణ నుంచి వచ్చిన డీఎస్పీలు నాగసాయి వేంకటరమణ, వేణుగోపాల్, రామకృష్ణ, పాలకొల్లు పట్టణ సీఐ కె. రజనీకుమార్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో ఊరేగింపుగా హిందూ శ్మశాన వాటికకు తరలించి పోలీస్ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

క్రైం సమాచారం

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య


రంగమ్మ మృతదేహం

ఏలూరు క్రైం, జూలై27(ఆంధ్రజ్యోతి): భర్త, కుమారుడు పనికి వెళ్లవద్దని మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఒక మహిళ పందికొక్కులను చంపే బిళ్లలను మింగి ఆత్మహత్యకు పాల్పడింది. మండవల్లి మండలం అయ్యవారినిరుద్రవరం గ్రామానికి చెందిన బొమ్మ రంగమ్మ(45)కు భర్త వెంకటేశ్వరరావు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక కుమారుడికి వివాహమైంది. కూలి పనులకు వెళ్లి జీవిస్తున్నారు. భర్త, అతడి కుమారుడు కూలి పనులకు వెళ్తుండగా రంగమ్మను పనికి వెళ్లవద్దని తాము కష్టపడుతున్నామని ఆదివారం మందలించారు. ఈ మేరకు మనస్తాపానికి గురైన ఆమె పందికొక్కులను చంపే బిళ్లలను మింగేసింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను ఒక ప్రైవేటు ఆసుపత్రికి, ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రికి తీసుకువెళ్లి తిరిగి మధ్యాహ్నం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. ఈ ఘటనపై ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు.

కారు ఢీకొని యువకుడి మృతి

ఏలూరు క్రైం, జూలై27(ఆంధ్రజ్యోతి):పదహారో నంబరు జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న ఒక యువకుడిని కారు ఢీకొని వెళ్లి పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సుమారు 25 ఏళ్ల వయస్సు కల్గిన యువకుడు ఆశ్రం ఆసుపత్రి సమీపంలోని హైవేపై ఆదివారం రాత్రి రోడ్డు దాటుతుండగా గుండుగొలను నుంచి విజయవాడ వైపు వెళ్లే ఒక తెల్లకారు ఢీకొని వెళ్లిపోయింది. ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఏఎస్‌ఐ స్వామి, డీటీఆర్పీ కానిస్టేబుల్ మధు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును పట్టుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దారి కాచి డబ్బులు దోస్తున్న నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ కాళీచరణ్

భీమవరం క్రైం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వెళ్లేవారిని దారి కాచి కత్తితో బెదిరించి డబ్బులు దోస్తున్న నిందితుడిని ఆదివారం అరెస్ట్ చేశామని భీమవరం టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ తెలిపారు. ఈనెల 26న సాయంత్రం భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన లంకపల్లి నాగేశ్వరరావు మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా గొల్లవానితిప్ప రోడ్డులో దేవరకొండ ప్రభాకర్ అనే వ్యక్తి అడ్డగించాడు. కత్తి చూపించి భయపెట్టి రూ.500 లాక్కున్నాడు. అంతేకాకుండా రూ. 2 వేలు ఇవ్వాలని, లేకపోతే చంపేస్తానని భయపెట్టగా బాధితుడు భయంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దేవరకొండ ప్రభాకర్‌ను ఆదివారం అరెస్ట్ చేశామని తెలిపారు. అతడితో ఉన్న కత్తి, రూ.500 స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన టూటౌన్ సీఐ కాళీ చరణ్, సిబ్బందిని డీఎస్పీ జయసూర్య, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అభినందించి రివార్డు ప్రకటించారు.

నాలుగు దేవాలయాల్లో చోరీ

నిడమర్రు జూలై 27(ఆంధ్రజ్యోతి):నిడమర్రు మండలంలోని దేవాలయాలలో దొంగలు హల్‌చల్ చేశారు. శనివారం అర్ధరాత్రి సమయంలో పత్తేపురంలోని మూడు దేవాలయాల్లో, పెదనింద్రకొలనులోని ఒక గుడిలో దొంగలు డిబ్బీలు పగుల గొట్టి డబ్బులు దోచుకుపోయారు. ఆదివారం ఉదయం సమాచారం తెలుసుకున్న స్థానికులు భయబాంత్రులకు గురాయ్యరు. నిడమర్రు ఎస్ఐ వీరప్రతాప్ తెలిపిన వివరాలివి. పత్తేపురంలో గల శ్రీకృష్ణుడు, ఆంజనేయ స్వామి, వినాయకస్వామి ఆలయాల్లో శనివారం అర్ధరాత్రి దాటాక దుండగులు దేవాలయాల్లోకి ప్రవేశించి డిబ్బీలు పగులగొట్టారు. వాటిలో గల సొమ్మును దోచుకుపోయారని ఆలయాల నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలియజేశారు. స్థానికుల తెలిపిన సమాచారం మేరకు సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయస్సుగల ముగ్గురు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చి దొంగతనం చేసినట్టు అనుమానిస్తున్నారు. పెదనింద్రకొలను గ్రామంలో తూర్పుపేట వినాయకస్వామి గుడిలో దొంగలు డిబ్బీ పగులు గొట్టి డబ్బులు దోచుకుపోయారు. ఈ దొంగతనాలలో ఎంత సొమ్ము పోయిందో స్థానికులు అంచనావేయలేకపోతున్నారు. ఒకేసారి నాలుగు ఆలయాల్లో దొంగతనాలు జరగడంతో స్థానికులు భయబ్రాంతులకు గురవుతున్నారు.

సమస్యల తిష్ట

భీమడోలు బస్టాండ్ నరకప్రాయం


అధ్వానంగా వున్న భీమడోలు జంక్షన్ బస్టాండ్ ప్రాంగణం

» వర్షం వస్తే గోతులతోపాటు బురదమయం

భీమడోలు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భీమడోలు జంక్షన్ నుంచి సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేసే ప్రయాణికులకు భీమడోలు బస్టాండ్ నరకప్రాయంగా మారింది. బస్టాండ్ ప్రాంతమంతా వర్షం వస్తే చాలు గోతులతో పాటు బురదమయం కావడంతో ప్రయాణికులు నడవడానికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలకు వేలాదిగా భక్తులు భీమడోలు బస్టాండ్ నుంచి బస్సుల ద్వారా ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. వర్షాకాలం వస్తే అటు బస్సులపై వెళ్లేవారు.. ఇటు ప్రయాణికులకు ఈ గోతులు, బురద తీవ్ర అసహనానికి గురి చేస్తున్నాయి. ప్రతిఏడాది బస్టాండ్ ప్రాంగణం తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూడడం లేదని ఈ ప్రాంతమంతా సిమెంట్ నిర్మాణం చేపట్టాలని అప్పుడే ప్రయాణికుల కష్టాలు తీరతాయని స్థానికులు కోరుకుంటున్నారు.

తరగతి గదిలో వర్షం


కుక్కునూరు పాఠశాలలో బకెట్లు పెట్టిన దృశ్యం

» స్లాబ్ నుంచి నీరు లీక్.. ఆందోళనలో విద్యార్థులు

కుక్కునూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండలంలో పలు పాఠశాలల్లోకి వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్లాబ్ నుంచి వర్షపు నీరు లీకై తరగతి గదుల్లో పడుతున్నాయి. కుక్కునూరు ప్రాథమిక పాఠశాలలో ఇదే పరిస్థితి ఏర్పడడంతో విద్యార్థులు గదుల్లో కూర్చునే పరిస్థితి లేకపోయింది. వర్షంనీరు పడడంతో తరగతిలో బకెట్లు పెడుతున్నారు. ముంపు పేరుతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పాఠశాలలు నిధులు కేటాయించడం లేదు. మరమ్మతులు చేయడంలేదు. రోజురోజుకు పాఠశా లలు శిథిలావస్థకు చేరుతున్నాయి. స్లాబ్ నుంచి పెచ్చులూడి కిందపడుతున్నాయి. కుక్కునూ రు పాఠశాలలో దాదాపు 25మంది విద్యార్థులు వస్తున్నారు. వర్షానికి లీకవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయం విద్యార్థుల్లోను, తల్లిదండ్రుల్లోనూ నెలకొంది.

రోడ్డంతా గోతులే

» వంగాయగూడెం కేన్సర్ ఆసుపత్రికి వెళ్లే రోడ్డు అధ్వానం

ఏలూరు రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): వంగాయగూడెం నుంచి కేన్సర్ ఆసుపత్రికి వెళ్లే రోడ్డంతా గోతులమయమై దారుణంగా తయారైంది. అడుగు తీసి అడుగు వేస్తే ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో వాహనాలు వెళ్లే సమయంలో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏ గొయ్యి ఎంత లోతు ఉందో తెలియని పరిస్థితుల్లో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఈ రహదారి వెంబడి వంగాయగూడెం చుట్టుపక్కల ప్రాంతాలైన కొత్తూరు, తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డంతా అధ్వానంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


వంగాయగూడెం కేన్సర్ ఆసుపత్రికి వెళ్లే రోడ్డు దుస్థితి

పరీక్ష సెంటర్ మార్పు దుర్మార్గం

» పెనుగొండ ఎస్వీకేపీ కళాశాల వద్ద నిరసన తెలిపిన అభ్యర్థులు


పెనుగొండ ఎస్వీకేపీ కళాశాల వద్ద అభ్యర్థుల నిరసన


కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ, అభ్యర్థుల హాల్ టికెట్ల బోర్డు

పెనుగొండ,జూలై 27(ఆంధ్రజ్యోతి): ముందస్తు సమాచారం లేకుండా పరీక్ష సెంటర్‌ను మార్పు చేయడం దుర్మార్గమని, తక్షణమే న్యాయం చేయాలని ఎయిడెడ్ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు డిమాండ్ చేశారు. పెనుగొండ ఎస్వీకేపీ సైన్స్ జూనియర్ కళాశాలలో ఆదివారం జరగాల్సిన ఏడు ఎయిడెడ్ పోస్టుల భర్తీ పరీక్షను నిలిపి వేయడంతో అభ్యర్థులు ఆందోళన చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఈసెంటర్‌కు 20 మంది పరీక్షను రాసేందుకు అభ్యర్థులు పెనుగొండ సెంటర్‌కు వచ్చారు. ఇక్కడకు వచ్చిన అభ్యర్థులకు పరీక్ష సెంటర్ ఇక్కడ కాదని తాడేపల్లిగూడెం, భీమవరం సెంటర్లకు మార్పు చేశామని చెప్పడంతో అభ్యర్థులు అవాక్కయ్యారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇప్పటికిప్పుడు మార్పు చేశామని చెప్పడం ఏమిటని సెంటర్ వద్ద కొంతసేపు నిరసన తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి పేపర్ ప్రకటన ఇచ్చామని, ఆదివారం ఉదయం వచ్చిందని చెప్పడంతో అప్పటికప్పుడు ప్రకటన చేయడం ఏమిటని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షకు సంబంధించి ఎగ్జామ్ సెంటర్ వద్ద అభ్యర్థుల హాల్ టిక్కెట్లతో కూడిన బోర్డును ఏర్పాటు చేశారు. పరీక్షను వాయిదా వేశామని ఫ్లెక్సీని ఏర్పాటు చేసి, మరో రెండు చోట్ల పరీక్షలు నిర్వహించడం తగదన్నారు. ఎయిడెడ్ పోస్టులకు కాంట్రాక్టుగా చేసిన తరువాత పర్మినెంట్ చేస్తామని కాల్ లెటర్‌లో పేర్కొన్నారని, ఎంతో కష్టపడి చదివి పరీక్షకు వస్తే ఈ విధంగా మార్పు చేయడం తగదని పైగా తాడేపల్లిగూడెం, భీమవరం సెంటర్‌లలో ఉదయం 9.30 గంటలకే పరీక్ష నిర్వహిస్తే ఏవిధంగా సెంటర్‌లకు వెళ్లి రాయడం సాధ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరీక్ష సెంటర్ మార్పు పలు అనుమానాలకు తావిస్తుందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

కాలేజీకి చేరని సమాచారం

పెనుగొండ ఎస్వీకేపీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించే ఎయిడెడ్ పరీక్షలకు సంబంధించి ఎటువంటి సమాచారం అందకపోవడం విడ్డూరంగా మారింది. ఈమేరకు పరీక్షా కేంద్రంలో యథావిధిగా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులలో కొందరు మూడు పోస్టులకు దరఖాస్తు చేసుకోవడంతో దీనికి అనుగుణంగా మూడుస్లాట్‌లలో పరీక్షలు ఏర్పాట్లు చేశారు. పరీక్షా సమయం కావస్తున్నా విద్యాశాఖాధికారులు రాకపోవడంతో అనుమానం వచ్చి సంప్రదిస్తే పరీక్షా కేంద్రం మార్పు చేసినట్టు చెప్పారు. అప్పటికే పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు చేరడంతో వారు డీలా పడిపోయారు. ముందస్తు సమాచారం అందించకుండా మార్పు ఎలా చేశారంటూ నిరసన తెలిపారు.

పరీక్ష రాసే అవకాశం పోయింది



ఏలూరు నుంచి ఉదయాన్నే ఇక్కడకు వచ్చాను. ఎయిడెడ్ పోస్టుకు కాంట్రాక్ట్‌గా చేసిన తరువాత పర్మినెంట్ చేస్తామని కాల్ లెటర్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ పరీక్ష కోసం ఎంతో కష్టపడి చదివా.. కాని పరీక్షను రాయనీయలేదు. మోసం చేశారు. ఉద్యోగాలు రాకుండా కావాలని చేశారు.

- దాసరి పద్మావతి, ఏలూరు.

ఇది దుర్మార్గం.. న్యాయం చేయాలి



మాకిచ్చిన కాల్ లెటర్‌లో పరీక్ష సమయం మధ్యాహ్నం 12 నుంచి 2.30 గంటల వరకు సమయం పేర్కొన్నారు. ఒక గంట ముందుగా పరీక్షా హాలు వద్దకు వచ్చినప్పటికి ఎవరూ స్పందించలేదు. అప్పటికప్పుడు తాడేపల్లిగూడెం వెళ్లి రాయాలంటే ఎలా సాధ్యం. కాల్ లెటర్‌లో ఉన్న సమాచారంతో అధికారులు ముందస్తుగా సెంటర్ మార్పు తెలియజేస్తే బాగుండేది. ఇది దుర్మార్గం. అధికారులు న్యాయం చేయాలి.

- జి. శైలజ, పెంటపాడు

పీ-4 మార్గదర్శుల కోసం టీచర్లపై ఒత్తిడి తగదు

» పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి, ఫ్యాప్టో సభ్యులు

ఏలూరు అర్బన్, జూలై27(ఆంధ్రజ్యోతి):ప్రజల ఆర్థిక అసమానతలను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ-4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్)లో మార్గదర్శులుగా రిజిస్టర్ కావాలంటూ అధికారులిచ్చిన పిలుపుపై పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి, ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది.

నిరాధార ఆరోపణలు చేయొద్దు : డీఈవో, ఏపీసీ

పీ-4లో గుర్తించిన బంగారు కుటుంబాలను టీచర్లు దత్తత తీసుకోవాలని గాని, ఆ మేరకు మార్గదర్శకులుగా రిజిస్టర్ కావాలని గాని జిల్లా విద్యాశాఖ నుంచి ఒత్తిళ్ళు వస్తున్నాయని నిరాధార ఆరోపణలు చేయడం తగదని డీఈవో వెంకటలక్ష్మమ్మ, సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్ ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. దీనిపై ఆదివారం ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర అభ్యంతరాలు రాగా, వాటికి దీటుగానే విద్యాశాఖాధికారులు స్పందించి పీ-4లో రిజిస్టర్ కావడం ఐచ్ఛికం మాత్రమేని వివరణ ఇచ్చారు. మార్గదర్శకులుగా రిజిస్టర్ కావాలంటూ ఉపాధ్యాయులపై కొందరు కలెక్టర్లు, డీఈవోలు ఒత్తిడి తెస్తుండటాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి, యూటీఎఫ్, ఏపీ ఫ్యాప్టో సభ్య సంఘాల జిల్లా నాయకులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ పథకంలో మార్గదర్శులుగా చేరేందుకు రిజిస్టర్ చేసుకోవడం స్వచ్ఛందమేనని ప్రభుత్వం స్పష్టం చేస్తున్నా జిల్లా అధికారులు మెసేజ్‌లు, సర్క్యులర్ల రూపంలో టీచర్లను బలవంతంచేయడం తగద న్నారు. దీనికనుగుణంగానే మండలానికి 190మంది హెచ్‌ఎం/స్కూల్ అసిస్టెంట్లు చొప్పున పీ-4లో తక్షణమే రిజిస్టరయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ జిల్లాలోని ఎంఈవోలకు ఆదేశాలు జారీచేయడంపట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. బలవంతపు రిజిస్ట్రేషన్లను వెంటనే నిలుపుదలచేయకపోతే అన్ని ఉపాధ్యాయ సంఘాలను కలుపుకుని ఆందోళనకు దిగుతామని ఫ్యాప్టో సభ్య సంఘాల జిల్లా నాయకులు మోహన్, కృష్ణ, రవికుమార్, రామారావు, రెడ్డిదొర, రామ్మోహన్, తదితరులు హెచ్చరించారు.

టీచర్లు విధులకు అంకితమైతే చాలు

ఉపాధ్యాయులు బోధనలో విద్యార్థులకు ఇప్పటికే మెంటర్లుగా, గైడ్‌లుగా వ్యవహరిస్తున్నారని, ఆ మేరకు వృత్తిపరమైన విధులకే టీచర్లు పరిమితం కావాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను జిల్లాలో ఎవరూ ఉల్లంఘించలేదని డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఎస్ఎస్ఏ ఏపీసీ పంకజ్‌కుమార్ స్పష్టం చేశారు. బోధనేతర విధులకు కలెక్టర్ కూడా వ్యతిరేకమన్నారు. ఉపాధ్యాయులు పనిచేసే స్కూలు గ్రామపరిధిలో గుర్తించిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామని, నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. ఇటువంటి వదంతులు వ్యాప్తిచేయరాదన్నారు. వృత్తిపరమైన బోధనా విధులకే ఉపాధ్యాయులు పరిమితమైతే చాలునన్నారు.


శ్రీవారి దర్శనానికి క్యూలైన్లలో వున్న భక్తులు

వెంకన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, జూలై 27(ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని దివ్యసన్నిధి ఆదివారం భక్తజనులతో నిండి పోయింది. సెలవురోజు కావడంతో పాటు వర్షం తగ్గుముఖం పట్టడం వల్ల ఆలయానికి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తుల సందడి నెల కొంది. భక్తుల రాకతో ఆలయంలోని అన్ని విభాగాలు కిటకిట లాడాయి. దాదాపు 15వేలకు పైబడి భక్తులు స్వామి, అమ్మ వార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది. దర్శనానంతరం భక్తులు స్వామి వారి ఉచిత తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు. ఆ తరువాత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

ద్వారకాతిరుమల సమాచారం

శ్రీవారి క్షేత్రంలో గదులు, కాటేజీల ఖాళీల వివరాలు

ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో ఈనెల 27న రాత్రి 7.30 గంటల సమయానికి ఖాళీ ఉన్న రూములు, కాటేజీల వివరాలిలా ఉన్నాయి.

రాణి చిన్నయమ్మారావు సదనం	31
టీటీడీ సత్రం	10
ధర్మ అప్పారాయ నిలయం	ఏసీ-66
	నాన్ ఏసీ-20
సూట్	13
బాలాజీ సదనం	4
కాటేజీలు	29

పడిన పొగాకు ధర


జంగారెడ్డిగూడెం వేలం కేంద్రంలో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు

» గిట్టుబాటు ధర లేక 'వర్జీనియా' రైతుల నిరాశ
» ఒకేసారి రూ.390 నుంచి రూ.370 పడిన వైనం

జంగారెడ్డిగూడెం,జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వర్జీనియా పొగాకుకు గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. శనివారం ఒకేసారి కిలో పొగాకు ధర రూ.390 నుంచి రూ.370కు పడిపోయింది. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా మంచి ధరలు వస్తాయనే ఆశతో రైతులు ఉత్సాహంగా పంట పండించారు. కానీ ప్రారంభం రోజునే రైతులు నిరాశ చెందారు. మొదటి రోజు క్వాలిటీ పొగాకు కిలో రూ.370 మాత్రమే వచ్చింది. సుమారు నాలుగు నెలల తర్వాత మాత్రమే కిలో పొగాకుకు రూ.20 పెరిగి 390కు చేరింది. అదికూడా వారంరోజుల్లో అనగా శనివారం ఎన్‌ఎల్‌ఎస్ పరిధిలోని ఐదు పొగాకు వేలం కేంద్రాల్లో అమాంతంగా రూ.370 పడిపోయింది. ఇక లో-గ్రేడ్ పొగాకు కిలో రూ.200 మాత్రమే ఉంది. ఒక ఎకరం పొలంలో సుమారు పది క్వింటాళ్ల పొగాకు పండితే దానిలో రెండు, మూడు క్వింటాళ్లు మాత్రమే క్వాలిటీ పొగాకు పండుతుంది. మిగిలిన ఏడు క్వింటాళ్లు లో-గ్రేడ్ పొగాకు పండుతుంది. అంటే తక్కువగా పండిన క్వాలిటీ పొగాకు ధరలు ఎంత పెరిగినా రైతులకు ఉపయోగం లేదు. లో-గ్రేడ్ పొగాకు ధరలు పెరగాలి. సరాసరి ధరరూ.350కు పైగా ఉంటేనే రైతులు నష్టపోకుండా ఉంటారు.

సిండికేట్‌గా పొగాకు కంపెనీలు..

పొగాకు కంపెనీలన్నీ సిండికేట్‌గా మారి ఒకేసారి ధరలను పతనం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. సోమవారం నుంచి ధరలు మరింత తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ నుంచి ఆర్డర్లు లేక పోవడమే దీనికి కారణమని పలు కంపెనీల ప్రతినిధులు రైతులకు చెబుతున్నట్టు తెలుస్తోంది.

లో-గ్రేడ్ పొగాకు ధర పెరగాలి



పొగాకు రైతు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. క్వాలిటీ పొగాకుకు ఎంత ధర పెరిగినా రైతుకు ఉపయోగం ఉండదు. పంటలో ముప్పై శాతం మాత్రమే క్వాలిటీ పొగాకు పండుతుంది. మిగిలిన 70 శాతం లో-గ్రేడ్ పొగాకు పండుతుంది. వారానికి రెండు, మూడు క్వాలిటీ బేళ్లకు మాత్రమే రూ.390 ధర వస్తుంది. రైతులు సంతోషంగా ఉండాలంటే సరాసరి ధర రూ.350కు పైగా ఉండాలి.

- పొన్నగంటి అనిల్, రైతు సంఘం నాయకుడు, జంగారెడ్డిగూడెం

దిగొచ్చిన కూరల ధరలు



తాడేపల్లిగూ డెం/ పాలకొల్లు అర్బన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కూరగాయల ధరలు దిగివస్తున్నాయి. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో కూరగాయల ధరలు కొద్దిగా దిగివచ్చాయి. పేద, మధ్య తరగతి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లిగూడెం మార్కెట్‌లో గత వారంతో పోలిస్తే ధరల్లో పెద్దగా వ్యత్యాసం లేకపోయిన వంకాయలు, బీరకాయల ధరలు తగ్గాయి. గతవారం వంకాయలు కిలో రూ.60 ఉంటే ప్రస్తుతం రూ.40కి విక్రయిస్తున్నారు. బీరకాయలు గతవారం రూ.60 ఉంటే ఈవారం రూ.40కు అమ్ముతున్నారు. ఆకాకర కాయలు రూ.240 నుంచి 200కు దిగివచ్చింది. దొండకాయలు రూ.40, బెండకాయలు రూ.40, టమాటాలు రూ.30 నుంచి 50కు విక్రయాలు జరుగుతున్నాయి. కాకర కాయలు రూ.50, పొట్లకాయ ఒక్కటి రూ.30, పచ్చిమిర్చి రూ.80 అమ్మకాలు చేస్తున్నారు. పాలకొల్లు సంతలో కేజీ వంకాయలు రూ.30, బీరకాయలు రూ50, దోసకాయలు రూ.25, దొండ, బెండ రూ.40, బంగాళా దుంపలు రూ.40, టమోటా రూ.30, అరటికాయలు జత రూ.15కు అమ్ముతున్నారు.

నిలకడగా ఉల్లి ధర..

ఉల్లి ధరలు నిలకడగానే ఉన్నాయి. ఇంకా కర్నూలు ఉల్లి రాకపోవడంతో మహారాష్ట్ర ఉల్లి ధరలు నిలకడగానే ఉన్నాయి. నాలుగు కిలోలు మంచివి రూ.100, రెండో రకం ఐదు కిలోలు రూ.100కు అమ్ముతున్నారు. గత వారంతో పోల్చుకుంటే ఉల్లి ధరల్లో వ్యత్యాసం లేదు. ఆగస్టు నెలాఖరుకు కర్నూల్ నుంచి ఉల్లి దిగుమతి అయితే ధరలు తగ్గుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

సూర్యనారాయణ స్వామికి అభిషేకాలు

ఏలూరుకార్పొరేషన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): పవరుపేట స్టేషన్ రోడ్డులోని శ్రీధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద శ్రావణ మాసంలోని తొలి ఆదివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయ ప్రదక్షిణలు నిర్వహించి స్వామిని దర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాళ్ళబండి ఆదినారాయణశర్మ వనమూలికల తీర్థాన్ని భక్తులకు అందజేశారు. ఆలయ చైర్మన్ కోరాడ రెడ్డి, బూరాడ పూర్ణచంద్రరావులు ఏర్పాట్లు చేశారు.



నేడు, రేపు విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

దెందులూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి):పెదవేగి మండలం పెదవేగి నుంచి రామ సింగవరం ఫీడర్‌లో నూతన విద్యుత్ లైను ఏర్పాటు నేపథ్యంలో ఈనెల 28,29 తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు అధికారి అంబేడ్కర్ తెలిపారు. రామసింగవరం పరిధిలోని వ్యవసాయ బోరు బావులకు తెల్లవారు జామున 3 గంటల నుంచి ఉదయం 9 వరకు మళ్లీ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేయనున్నట్టు తెలిపారు.



దమ్ము చేస్తున్న ట్రాక్టర్

ముమ్మరంగా ఖరీఫ్ పనులు

» కురుస్తున్న వర్షాలతో నాట్లు చేపట్టిన రైతులు

ద్వారకాతిరుమల, జూలై 27(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ పనులకు ఊతమిస్తున్నాయి. దీంతో మండలంలో ముమ్మరంగా వ్యవసాయ పనులు సాగుతున్నాయి. ఇందులో భాగంగా రైతులు తమ వ్యవసాయ భూములను దమ్ముచేయడం, నాట్లు వేయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది మండలంలో ఖరీఫ్ లక్ష్యం దాదాపు 4,500 ఎకరాలు కాగా ఇప్పటివరకూ రైతులు నారాయణపురం, ఎంనాగులపల్లి, పికన్నాపురం తదితర ప్రాంతాల్లో దాదాపు 250 హెక్టార్లలో వరి నాట్లు వేశారు. మరి కొన్ని చోట్ల ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం దేవినేనివారిగూడెం, సూర్యచంద్రరావుపేట, ఎం.నాగులపల్లి, నారాయణపురం పికన్నాపురం, శరభాపురం, రామశింగవరం తదితర గ్రామాల్లో నాట్లు పనులు జరుగుతున్నాయి. అలాగే పలు ప్రాంతాల్లో దమ్ముపనులు వేగవంతం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ రైతులు కష్టించి పనిచేస్తున్నారు. మరో పది పదిహేను రోజుల్లో నాట్లు పనులు పూర్తవుతాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

తడికలపూడి ఎస్ఐ చెన్నారావుకు ఎస్పీ ప్రశంస



కామవరపుకోట, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలో నేరాలు అరికట్టడంలో ప్రముఖ పాత్ర వహిస్తూ ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు తీసుకుంటూ పకడ్బందీగా సేవలందిస్తున్న తడికలపూడి ఎస్ఐ పి.చెన్నారావును, స్టేషన్ కానిస్టేబుల్ ఎ.సుధీర్‌లను ప్రశంసించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎస్ఐ, పీసీలకు ఎస్పీ అభినందించడం పట్ల పలు ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ వర్షాకాలంలో తక్షణ స్పందనకు ఏలూరు జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను సిద్ధం చేశామని, వర్షాకాలం నీటి పారుదల, వరదలు వంటి ప్రమాద సమయాల్లో తక్షణం స్పందించడం కోసం ఫోర్సును సిద్ధం చేసినట్టు తెలిపారు. ఈ బృందంలో ఎంపికైన పోలీస్ సిబ్బందికి ఈత, రెస్క్యూ అంశాల్లో ప్రత్యేక శిక్షణనిచ్చామని, ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన తడికలపూడి పీసీ ఎ.సుధీర్‌ను అభినందించి నిబద్ధతను గుర్తించి ప్రశంసా పత్రాన్ని అందచేసినట్టు తెలిపారు.

అగ్రహారంలో ఉచిత వైద్య పరీక్షలు

ఏలూరు రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): పోషకాహారం, వ్యాయమం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుందని విజయవాడ సెంటిని హాస్పిటల్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కాగిత కృష్ణచంద్ అన్నారు. ఆదివారం అగ్రహారంలోని ఎస్వీఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో విజయవాడ సెంటిని హాస్పిటల్ వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, సుగర్, ఈసీజీ, టూడీ ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. డాక్టర్ కృష్ణచంద్ రోగులను పరీక్షించి వైద్య సలహాలు అందించారు. గుండెపోటు వచ్చే ముందు ఛాతిలో నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. మొదటి గంట అత్యంత కీలకమని, ఇలాంటి లక్షణాలు ఉన్నవారిని అంబులెన్స్ సాయంతో మొదటి గంటలోపు ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చన్నారు. జి.మేఘనాథ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికైన యూత్ కమిటీ సభ్యులు

కొమరం భీమ్ మండల యూత్ కమిటీ ఏర్పాటు

జీలుగుమిల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): కొమరం బీమ్ మండల యూత్ అధ్యక్ష కార్యదర్శుల ఎంపిక ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. ఆదివారం జీలుగుమిల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో యూత్ అధ్యక్ష ఉపాధ్యక్షులుగా పద్దం వెంకటకృష్ణ, తామ సింగన్నదొర, కార్యదర్శిగా మడకం ధర్మరాజును ఎన్నుకున్నారు. సభ్యులుగా బొగ్గం రాంబాబు, లూకా రామ్ కుమార్, కోరం బుజ్జి, మొడియం సాయి, చింతం పుల్లారావు, పరిష్క రమేష్, యుకా యశ్వంత్, మండకం తమన్నదొర, పొట్టా రాంబాబు, రాజ్‌కుమార్, మడకం బుచ్చిరాజు ఉన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పర్యటనను జయప్రదం చేయండి

ఏలూరుకార్పొరేషన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎర్రకాలువ మిగుల భూముల సమస్యలపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం టి.నర్సాపురం మండలం జంగారెడ్డిగూడెం మండలాల్లో పర్యటిస్తారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టి.నర్సాపురం, జంగారెడ్డిగూడెం మండలాల పరిధిలో 1985లో కరాటం కృష్ణమూర్తి జలాశయం పేరుతో ఎర్రకాలువ రిజర్వాయరును నిర్మించారని, ఈ సందర్భంగా భూసేకరణ చేసి సంబంధిత రైతులకు నష్టపరిహారం కూడా చెల్లించారన్నారు. ఆ నష్టపరిహారంతో వచ్చిన డబ్బులతో వేరే చోట్ల భూములు కొనుగోలు చేసుకుని రిజర్వాయరు పేరుతో ఆనాటి ప్రభుత్వానికి అమ్మివేసిన భూముల తాలూక సాగు చేస్తున్నారన్నారు. ఈ సమస్యలపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మిగులు భూముల సమస్యలపై చర్చిస్తారని రవి తెలిపారు.

జనసేనలో చేరిన వైసీపీ నాయకులు



జనసేనలో చేరిన నాయకులతో కరాటం

జంగారెడ్డిగూడెం, జూలై 27(ఆంధ్రజ్యోతి): దేవులపల్లి వైసీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ దోరేపల్లి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 50 మంది జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ నేత కరాటం రాంబాబు ఆదివారం వీరికి జెండాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు కరాటం రాంబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ వీరిని పార్టీలోకి ఆహ్వానించారు. జనసేన జిల్లా నాయకురాలు జి.ఉమా మహేశ్వరి, ఆకుల రాకేష్, ఉక్కుర్తి సీతారామ్, వలవల తాతాజీ, షేక్ పీరు, మడక రవి, విజ్జు వెంకటస్వామి నాయుడు, చింతల నాని, ఆకుల రాకేష్ పాల్గొన్నారు.

ఆక్రమణలు.. అడ్డంకులు!

(5వ పేజీ తరువాయి)

నాలుగు అడుగులు ఖాళీ మాత్రమే ఉంది. దీంతో నీరు దిగువకు పారుదల అయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. చిన్నఎడ్లగాడి వంతెనకు దిగువ భాగాన కిక్కిసకర్ర దట్టంగా అలుముకు పోయింది. పెద్దఎడ్లగాడి వంతెన ఎగువ భాగాన గుర్రపు డెక్క, తూడు దట్టంగా పేరుకుపోయింది. కొల్లేరుకు వరద వస్తే ఎగువన ఉన్న మండవల్లి మండలంలోని పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, మణుగులూరు తదితర గ్రామాలకు ముంపునకు గురవుతాయి.

విజయవాడకు ముంపే : ఉప్పుటేరు ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించకపోతే ఏటా బుడమేరు నుంచి వచ్చే వరద నీటి ప్రవాహానికి అవరోధం కలుగుతుంది. దీంతో ఎగువన ఉన్న విజయవాడతో పాటు పలు గ్రామాలు సైతం జల దిగ్బంధానికి గురయ్యే పరిస్థితులు ఉన్నాయి. గతేడాది వర్షాకాలంలో బుడమేరు ఉధృతంగా ప్రవహించడంతో విజయవాడ పరిసర ప్రాంత గ్రామాలు ముంపు బారిన పడిన సంగతి తెలిసిందే. బుడమేరుకు ప్రధాన మార్గమైన కొల్లేరు, ఉప్పుటేరు ఆక్రమణలను చెత్తాచెదారాలను తొలగించకపోతే మరలా విజయవాడ ముంపునకు గురయ్యే ప్రమాదముందని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం

● దెందులూరులో పోలీస్ సిబ్బంది ఉన్నా లేనట్టే..
● డిప్యూటేషన్ విధుల్లో కానిస్టేబుళ్లు
● పేట్రేగిపోతున్న అసాంఘిక శక్తులు



దెందులూరు పోలీస్ స్టేషన్

దెందులూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): దెందులూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పనిచేసే కానిస్టేబుల్స్ వేరొక ప్రాంతాల్లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తుండటంతో మండలంలో శాంతి భద్రతల పర్యవేక్షణ కష్టతరంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి సమీపంగా ఉన్న సోమవరప్పాడు, గుండుగొలను గ్రామాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. బహిరంగ ప్రదేశాలు, పొలాలు ఎక్కువగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. చికెన్ వ్యర్థాల తరలింపు, గంజాయి, పశువుల రవాణా గుంటూరు, వైజాగ్ నుంచి ఎటు తరలించాలన్నా దెందులూరు మండలాన్ని టచ్ చేయాల్సిందే. మరోవైపు జాతీయ రహదారిపై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో ఊహించడం కష్టం. సత్యనారాయణపురం, దెందులూరు అడ్డరోడ్డుసోమవరప్పాడు టర్నింగ్, ఆశ్రం ఆస్పత్రి ప్రాంతాలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. దీంతో పాటు దెందులూరు జాతీయ రహదారిపై రాష్ట్రంలో ముఖ్య నగరాల నుంచి అక్రమంగా రేషన్ బియ్యం, చికెన్ వ్యర్థాలు తరలిస్తుంటారు. వీటిని అడ్డుకునేందుకు పోలీస్ సిబ్బంది తగినంత లేరు, పోలీస్ స్టేషన్‌కు సిబ్బంది ఉన్నా అదనపు బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తోంది. ఒక ఎస్ఐ, ఇద్దరు ఏఎస్ఐలు, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 21 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. అయితే 21 మంది కానిస్టేబుళ్లలో పది మంది వివిధ కోర్టు కేసులు, ప్రోటోకాల్, ఎయిర్‌పోర్టు విధుల్లో డిప్యూటేషన్ పని చేస్తున్నారు. దీంతో మండలంలో 17 గ్రామాలకు గాను శివారు గ్రామాలతో కలుపుకుంటే 20 పంచాయతీలున్నాయి. సిబ్బంది కొరత కారణంగా కొన్ని గ్రామాల్లో పోలీస్ నిఘా కరువైంది. కొన్ని ఎస్సీ గ్రామాల్లో ఘర్షణలు, ఇతర గొడవలు అరికట్టడం, అదుపుచేయడంలో నిఘా కొరవడుతోంది. దీంతో ఉన్న సిబ్బందికి కత్తిమీద సాముగా మారింది. పలు గ్రామాల్లో రాజకీయ ఘర్షణలకు దెందులూరు వేదికగా ఉంది. దీంతో గ్రామాల్లో శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం ఏర్పడుతోంది. ప్రతీ గ్రామానికి కనీసం ఒక్క కానిస్టేబుల్ అయినా విధుల్లో ఉండాల్సిన అవసరముంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యం



ప్రచారపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

ఏలూరు రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): కొల్లేరు గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏలూరు రూరల్ మండలంలోని శ్రీపర్రు, పెదయాగనమిల్లి, మానూరు, మహేశ్వరపురం, కోమటిలంక గ్రామాల్లో ఆదివారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పాలనను ప్రజలకు వివరించారు. కొల్లేరులోని కోమటిలంక బిడ్జి నిర్మాణ పనులకు అవసరమైన నివేదికలను అటవీ శాఖతో పాటు కేంద్ర ప్రభుత్వాలకు నివేదికలు సమర్పించామని, గత వైసీపీ హాయంలో అధికారాన్ని అడ్డు పెట్టుకుని ప్రజాధనాన్ని దోచుకున్న అక్రమార్కుల నుంచి ప్రతి ఒక్క రూపాయి రికవరీచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కొల్లేరు నాయకులు సైదు సత్యనారాయణ, నంబూరి నాగరాజు, నేతల రవి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి నాయకుల ప్రచారం

● చింతలపూడి: నగర పంచాయతీలోని మారుతీ నగర్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్నిచోట్ల నగర పంచాయతీ వీధుల్లోగాని, ప్రధాన రోడ్లు, కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీలు లేక ఇబ్బందులు పడుతున్నారని, మునిసిపాల్టీగా చేసి ఏం లాభమని అడుగుతున్నట్టు కార్యకర్తలు చెబుతున్నారు. కొవ్వూరుగూడెం, ఎన్‌వీఎన్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. పట్టణ నాయకులు కొత్తపూడి శేషగిరిరావు, కంభం రమేష్, చందు, పలువురు పాల్గొన్నారు.

● కామవరపుకోట: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా అంకాలంపాడులో టీడీపీ మండలాధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. రామకృష్ణ బృందం ఇంటింటికీ వెళ్లి బ్రోచర్లను అందచేసి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాలు సజావుగా అందుతున్నాయా, లేవా అని అడిగి తెలుసుకున్నారు. తల్లికి వందనం నగదు జమైందా అని విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వం కలగ చేసిందని రామకృష్ణ వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోనేరు వెంకట సుబ్బారావు,ఘంటా సుధీర్‌బాబు, బాహుబలేంద్రుని బాలవర్ధిరాజు, షేక్ వలీ, సీతారామరాజు, నెక్కలపు సూర్యనారాయణ, నెక్కలపు గంగాధరరావు ఉన్నారు.



శ్రీనివాసపురంలో ప్రచారం చేస్తున్న దాసరి శేషు

● జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం విస్తృతంగా జరుగుతోంది. ఆదివారం టీడీపీ మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో అమ్మపాలెంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, శ్రీనివాసపురంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు పాల్గొన్నారు. రామలింగేశ్వరరావు, శేషు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తోందన్నారు. టీడీపీ నాయకులు చాత్రాతి వీర వెంకట సత్యనారాయణ, వీరవల్లి రామకృష్ణ, ఎలికే వరప్రసాద్, రాగాని శ్రీనివాస్, పోల్నాటి సత్యనారాయణ, తాళ్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





అట్టహాసంగా ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రం, నిరుపయోగంగా ఉన్న షెడ్డు

నీరుకారుతున్న స్వచ్ఛాంధ్ర లక్ష్యం

నిరుపయోగంగా చెత్త సేకరణ వాహనాలు

అంతంత మాత్రంగానే చెత్త సేకరణ పనులు



నిరుపయోగంగా మారిన వర్మీకంపోస్టు తొట్టెలు

జీలుగుమిల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లిలో చెత్త సేకరణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. గత ప్రభుత్వం హయాంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా పంచాయతీలకు కొనుగోలు చేసి పంపారు. వాహనాల నాణ్యతాలోపంతో కొద్దిరోజులకే మూలన పడ్డాయి. దీంతో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నీరుకారింది. మరోవైపు డంపింగ్ యార్డుల నిర్వహణ పారిశుధ్య పనులపై సంబంధిత అధికారులు దృష్టి కొరవడటంతో మండలంలో పలు పంచాయతీల్లో డంపింగ్ యార్డుల నిర్వహణ సైతం అంతంతమాత్రంగానే ఉంది. కొన్ని పంచాయతీల్లో మూలన పడ్డ వాహనాలను ఒకటి, రెండు చెత్త సేకరణ రిక్షాల్ని కార్యదర్శులే రిపేరు చేయించి వాటితో కాలక్షేపం చేస్తున్నారు. ప్రస్తుతం పలు పంచాయతీల్లో ఒకటి రెండు చెత్త సేకరణ వాహనాలు మాత్రమే పనిచేయడం గమనార్హం. కొన్నింటికి బ్యాటరీలు పాడవటం, మిగిలిన వాహనాల్ని రిపేరు చేయించేందుకు పంచాయతీల్లో తగిన నిధులు లేవని అధికారులు చెబుతున్నారు. దీతో ఇలా గ్రామాల్లో పారిశుధ్య పనులు సజావుగా సాగటంలేదు. ఉన్న ఒకటి రెండు వాహనాలతో గ్రామంలో ఒక వీధిలో చెత్త సేక రణ చేస్తే మరో వీధిలో పేరుకు పోతుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వాహనాలు లేనికారణంగా డంపింగ్ యార్డులకు వెళ్లాల్సిన చెత్త గ్రామాల్లో దర్శనమిస్తోంది. డంపింగ్ యార్డుల్లో నిర్మించిన తడి, పొడి చెత్త వేరు చేసి అందుకు ఏర్పాటు చేసిన నాడెప్ పిట్‌లు (వర్మీ కంపోస్టు తొట్టెలు) సైతం నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. డంపింగ్ యార్డుల నిర్వహణ, గ్రామాల్లో చేత్త సేకరణ, చెత్త నుంచి సంపద తయారీ వంటి అంశాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించి గ్రామాల్ని పరిశుభ్రంగా ఉంచాలని గిరిజన గ్రామాల్లో ప్ర స్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలని, పంచాయతీల్లో పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలని గిరిజన సంఘాల ప్రతి నిధులు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడాలి



ప్రచారపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఏలూరు కార్పొరేషన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులపై భారం మోపే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ ఈ నెల 28 నుంచి ఇంటింటి ప్రచారం, సంతకాల సేకరణ, ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్టు వామపక్ష పార్టీల ప్రజావేదిక నాయకులు పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయం వద్ద ఆదివారం సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుని ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు యూవీ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవిలు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలన్నారు. నాయకులు బండి వెంకటేశ్వరరావు, పంపన రవి, బద్దా వెంకట్రావు, కె.శ్రీనివాస్, డి.ఎన్.వి.డి.ప్రసాద్, రెడ్డి శ్రీనివాస డాంగే, పి.కన్న బాబు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం:స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోకపోతే మరో ఉద్యమాన్ని ప్రభుత్వం ఎదుర్కోవలసి వస్తుందని సీపీఐ నాయకులు హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో మండలంలోని పంగిడిగూడెంలో ఆదివారం ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు.ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి జె.వి.వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొలిమే బాలయేసు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేయడం కోసం స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చారన్నారు. 5న మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. కుంచే నాగేంద్రబాబు, గూడే ఆశీర్వాదం, నిట్టా రామారావు, గంగాధరరావు, గొలిమే బేబీ పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో వృద్ధాశ్రమానికి సరుకుల అందజేత



జంగారెడ్డిగూడెం, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వం అని లయన్స్ క్లబ్ 316 జి.గవర్నర్ పాపారావు నాయుడు అన్నారు. కామవరపుకోట మండలం జీలకర్ర గూడెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.ఆర్.ఆర్. రంగరాజు, రీజనల్ చైర్ పర్సన్ ఆర్.ఆర్. రత్నకుమారి ఆర్థిక సహకారంతో జంగారెడ్డి గూడెంలోని సీతామహాలక్ష్మి వృద్ధా శ్రమానికి ఆదివారం నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లయన్స్ క్లబ్, ఏలూరు వైభవ్ ఆదర్శ్ లయన్స్ క్లబ్, చింతలపూడి లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పుప్పాల గోపి

వృద్ధురాలికి గూడు కల్పించాలని నిర్ణయం

ఉంగుటూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): కైకరంలో వృద్ధురాలికి గూడు కల్పించాలని మండల మానవత సమావేశం నిర్ణయించింది.ఆదివారం గోపీనాథపట్నంలో మండల శాఖ అధ్యక్షులు కోనే సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో ఆగస్టు 3న నల్లజర్లలో జరిగే జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఎక్కువ మంది హాజరు కావాలని రీజనల్ కో-ఆర్డినేటర్ పుప్పాల గోపి పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో కాలేజీ విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు నిర్వహించడంతో పాటు మానవత సభ్యత్వాల నమోదును పెంచాలని కోరారు. గోపీనాథపట్నం సర్పంచ్ పి.విష్ణు, ఎర్రమిల్లిపాడు సర్పంచ్ తమ్మిన శ్రీనివాసరావు, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, అడపా శ్రీనివాసరావు, శీతాల సత్యనారాయణ, బొమ్మిడి అప్పారావు, గంజి రవికుమార్, గురువెల్లి రాజారావు, రామిరెడ్డి వెంకట రెడ్డి, తాతారావు, పైడిముక్కల రమేశ్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న వాసిరెడ్డి మధూ కుటుంబం

చర్చి నిర్మాణానికి రూ.లక్ష విరాళం

టి.నర్సాపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): బంధంచర్ల గ్రామంలో ఆర్‌సీఎం చర్చ్ నిర్మాణానికి గ్రామానికి చెందిన వైసీపీ ఏలూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు, కే.జగ్గవరం సొసైటీ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి మధూ కుటుంబ సభ్యులు రూ.లక్ష చెక్కును ఆదివారం చర్చ్ సంఘస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి మధూ మాట్లాడారు. అనంతరం గ్రామస్థులు, చర్చ్ సంఘస్థులు, దాతలు వాసిరెడ్డి మధూ, వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



విద్యార్థులకు సాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

సుష్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం

పెదపాడు, జూలై 27(ఆంధ్రజ్యోతి):చదువుకు పేదరికం అడ్డు కాకూడదని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరినప్పుడే జీవితంలో గెలుపొందినట్టుగా నాయుడుగూడెం గ్రామానికి చెందిన వల్లూరి సుష్మ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వల్లూరి వెంకట కృష్ణయ్య తెలిపారు. పెదపాడు గ్రామానికి గారపాటి దుర్గా ప్రణీత, సాయిమోహిత్‌లు ఇంటర్, బీటెక్ చదువుతుండగా, ఆర్థిక ఇబ్బందుల కారణంగా కళాశాలల ఫీజులు చెల్లించేందుకు అవసరమైన రూ. 56 వేలను ట్రస్ట్ వైస్ చైర్మన్ వల్లూరి సుభద్రాదేవితో కలిసి ఆదివారం అందజేశారు. ట్రస్ట్ తరపున చదువుకు అన్ని విధాలా తోడ్పాటునందిస్తామని, కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని వెంకటకృష్ణయ్య ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. బలుసు శ్రీనివాసరావు, గారపాటి స్వాతి పాల్గొన్నారు.



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అర్హులందరికీ పింఛన్

ఏలూరుటూటౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన వారందరికి పింఛన్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు త్వరలోనే నూతన పింఛన్లు అందజేస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇప్పటికే 80 శాతం హామీలు నెరవేర్చామన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని చేపట్టామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తక్షణ కర్తవ్యమన్నారు.



కృతజ్ఞతలు తెలుపుతున్న నూతన కమిటీ

జనసేన డివిజన్ కమిటీల ఏర్పాటు

ఏలూరు రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): నగరంలో 16, 23వ డివిజన్లకు నూతన కమిటీలను ప్రకటించింది. 16వ డివిజన్‌కు రాపూరి దుర్గా మోహన్ ఇన్‌చార్జిగా, కోరాడ రాజును అధ్యక్షుడిగా నియమించారు. 23వ డివిజన్‌కు కుప్పాల పూర్ణ చంద్రశేఖర్(చందు) ఇన్‌చార్జిగా, పోట్రు నారాయణరావును డివిజన్ అధ్యక్షుడిగా నియమించారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆ డివిజన్ కమిటీలను అభినందించారు. అప్పలనాయుడు మాట్లాడుతూ జనసేన పార్టీకి కార్యకర్తలే బలమని అన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోషన్

రోడ్డు పనులు పరిశీలన

కామవరపుకోట, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలోని కామవరపుకోట మండలంలోని రావికంపాడు నుంచి తడికలపూడి వరకు గల రోడ్డు అభివృద్ధి పనులు, గోతులు పూడ్చివేత వంటి పనులు నాణ్యతా ప్రమాణాలతో కూడి వేగవతంగా పనులు పూర్తి చేయాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సూచించారు. ఆదివారం ఉప్పలపాడు వద్ద జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్లతో సమీక్షించారు. జాప్యం చేయకుండా పనులు పూర్తి కావాలని హెచ్చరించారు.ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్ బాబు, కామవరపుకోట మాజీ ఉప సర్పంచ్ నెక్కలపు సూర్యనారాయణ, బొబ్బిలి డాన్ దివాకర్, ఘంటా రవికుమార్ ఉన్నారు.

నేడు కార్మికుల ధర్నా

ఏలూరుకార్పొరేషన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, పాత క్లెయిమ్‌లు వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసడాంగే, ఏపీ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ చేపల్లి శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు.

చిన్నారులకు చదవడంపై అవగాహన

భీమడోలు, జూలై 27(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమంలో చిన్నారులకు పలు అంశాలపై శిక్షణనిచ్చారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు కథలు చెప్పడం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటం ఎదుట నివాళులర్పించారు. ఉపాధ్యాయులు సుధాకర్, గ్రంథపాలకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

నిడమర్రు, జూలై 27(ఆంధ్రజ్యోతి): భువ్వనపల్లి పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. నిడమర్రు ఎస్ఐ వీర ప్రతాప్ తెలిపిన వివరాలు ప్రకారం భువ్వపల్లి వెలమపేటలో పశువుల పాకలో పేకాడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేయగా 10 మందిని అరెస్టు చేసి వారినుంచి సుమారు రూ.7,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అరెస్టు చేసిన వారిని సోమవారం తాడేపల్లిగూడెం కోర్టులో హాజరు పరుస్తామని ఎస్.ఐ. వీర ప్రతాప్ తెలిపారు.

పంటల బీమాకు దరఖాస్తులు అంతంతే!

(5వ పేజీ తరువాయి)

రైతుల పథకంలో నమోదు చేయడానికి అవసరమైన పత్రాలు తీసుకుని సమీపంలో ఉన్న కామన్ సర్వీస్ సెంటర్ (మీసేవా కేంద్రం), పోస్టాఫీసు/గ్రామ సచివాలయంలో సంప్రదించి గడువు తేదీలోగా ప్రీమియం నగదు చెల్లించి తమ వివరాలు నమోదు చేసుకోవాలి. ఇతర వివరాలకు సమీపంలో ఉన్న బ్యాంకు శాఖ, సం బంధిత వ్యవసాయ శాఖాధికారిని, సంబంధిత బీమా కంపెనీల ప్రతినిధులను సంప్రదించవచ్చు.

నేడు గృహ నిర్మాణాల సమస్యలపై మంత్రి సమీక్ష

కైకలూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గంలోని గృహ నిర్మాణ సమస్యల పరిష్కారానికి సోమవారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. కైకలూరు సీఎస్నార్ గార్డెన్లో ఎమ్మెల్యే కామినేని అధ్యక్షతన అధికారులతో సమావేశం అనంతరం గ్రీన్ విలేజ్‌లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుంటారు. నియోజకవర్గంలోని ఇళ్ల సమస్యలు ఉన్న లబ్ధిదారులు నేరుగా కలవవచ్చని సూచించారు. కాగా అభివృద్ధి పనులను మంత్రి సారథి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రారంభిస్తారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): వరహాపట్నంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ శ్రీనివాస్ తెలిపారు. సోమేశ్వరం, రామవరం ఫీడర్ల పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు నిర్వహిస్తామని సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. సీతనపల్లి, దొడ్డిపట్ల, రామవరం, సోమేశ్వరం గ్రామాల్లోని వినియోగదారులందరూ గమనించి సహకరించాలని కోరారు.

'మన్ కీ బాత్'తో సామాజిక చైతన్యం



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న తపనా చౌదరి తదితరులు

నూజివీడు టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న అనేక కళలను, వ్యక్తుల ప్రతిభాపాటవాలను బాహ్య ప్రపంచానికి తెలిసే విధంగా ప్రాచుర్యం కల్పిస్తున్న ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమం సమసమాజ స్ఫూర్తికి అద్దం పడుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపనా చౌదరి) అన్నారు. ఆదివారం నూజివీడులో ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వీక్షించి కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. బీజేపీ నూజివీడు పట్టణ అధ్యక్షులు మల్లెపూడి నాగరాణి, ఏఎంసీ ఛైర్మన్ కుంపటి అరుణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జీఆర్‌కె రంగారావు, జిల్లా నాయకులు బోను అప్పారావు, శివరాజు వసుంధరా దేవి, మాటూరి రవి కాంత్, ఎం రాజశేఖర్, గోగినేని శ్రీనివాస కుమార అప్పారావు, మాగంటి వాసు, భావరాజు పుల్లారావు, రాజేంద్రప్రసాద్, జనసేన నాయకులు సూరిశెట్టి శివ, బజారు దుర్గాప్రసాద్, ముసునూరు, ఆగిరిపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక చేయూతే చంద్రబాబు ధ్యేయం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ముదినేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలన్న తపన, పట్టుదలతో సీఎం చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పలువురు శాసన సభ్యులు, నాయకులు పేర్కొన్నారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం ముదినేపల్లిలో జరిగిన వేడుకలతోపాటు మెగా రక్తదాన శిబిరంలో ఏలూరు, దెందులూరు, గోపాలపురం ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, మద్దిపాటి వెంకట్రావు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, గోపాలపురం ఏఎంసీ ఛైర్మన్ బ్రహ్మారాజు పాల్గొన్నారు. కైకలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ నరసింహారావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పైడిమర్రి మాల్యాద్రి, అంద్రాజు శ్రీనివాస్, లంకా రత్నారావు, టీడీపీ నాయకుడు పెన్మెత్స త్రినాథరాజు తదితరులు పాల్గొన్నారు. సుమారు 200 మంది రక్తదానం చేశారు.

సహకార సేవలను విస్తరిస్తాం : గన్ని



ముదినేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు సహకార రంగ సేవలు మరింత విస్తరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. ఆప్కాబ్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా ముదినేపల్లి వచ్చిన ఆయన్ని ఆదివారం కొడాలి వినోద్ నివాసం వద్ద వినోద్‌తో పాటు పార్టీ నాయకులు వీరమల్లు నరసింహారావు, చలసాని జగన్మోహనరావు, పోసిన పాండురంగారావు తదితరులు సత్కరించారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



ముసునూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి), టీడీపీ నాయకుడు తులిమెల్లి రంగారావు అన్నారు. ముసునూరు బీసీ కాలనీలో ఎంపీటీసీ-2 తులిమెల్లి కృష్ణకుమారి ప్రసాద్ సమకూర్చిన రూ. 3 లక్షలతో డ్రైన్ నిర్మాణ పనులను ఆదివారం నాయకులు ప్రారంభించారు. సుమారు 50 మీటర్ల పొడవునా డ్రైన్ నిర్మాణానికి పూడికతీత పనులను పూర్తిచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయల నిధులను విడుదల చేసిందన్నారు. నియోజకవర్గ బీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నక్కా యోహాను పాల్గొన్నారు.



ఫోటో, వీడియో గ్రాఫర్స్ నూతన కార్యవర్గం

కైకలూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గ ఫోటో, వీడియో గ్రాఫర్స్ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా దుర్గం శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కైకలూరు నిర్వహించిన నియోజకవర్గ ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడిగా కసగాల శ్యాంసువర్ణరావు (సుమంత్), నరహరిశెట్టి శ్యాంబాబు, ఉపాధ్యక్షుడిగా చాబత్తిన ప్రేమ్‌కిరణ్, కార్యదర్శిగా కొచ్చర సుకుమార్, ఉప కార్యదర్శిగా వాసిపల్లి సతీష్‌కన్నా, కోశాధికారిగా ఘంటసాల రామకృష్ణ, పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు

ముదినేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సింగరాయ పాలెం - చేవూరుపాలెం సెంటరులోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నుంచే కాక ప్రక్క జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామి వార్లకు పూజలు, అభిషేకాలు జరిపారు. మహిళలు పాల పొంగళ్ళతో మొక్కులను తీర్చుకున్నారు. పుట్టలో పాలు పోసి, నాగ ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ గంగా శ్రీదేవి పర్యవేక్షణలో అర్చకులు పూజలు జరిపారు.

ఘనంగా అంకమ్మ జాతర

చేవూరుపాలెంలో పరసా వారి అంకమ్మ జాతర ఆదివారం కోలాహలంగా జరిగింది. పోతురాజు గెడ ప్రతిష్ఠించి జాతర నిర్వహించారు. అమ్మవారికి మహిళలు శ్రావణ సారె సమర్పించారు. సర్పంచ్ విశ్వేశ్వరరావు పూజలు చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

టీచర్లేరీ..?

ముదినేపల్లి జడ్పీ హైస్కూళ్లలో టీచర్ల కొరత

మండలంలో భర్తీ కాని 18 పోస్టులు

ముదినేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. మండలంలో 10 హైస్కూళ్లు ఉండగా, కొత్తగా అప్‌గ్రేడ్ అయిన సింగరాయపాలెం హైస్కూల్‌తోపాటు, పెదపాలపర్రు హైస్కూల్‌లో మాత్రమే పూర్తి స్థాయిలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యాయి. ఎక్కువగా బయాలజీ సైన్స్ ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉన్నాయి. మండలంలో ఇంగ్లీష్ టీచర్ పోస్టు ఒకటి, హిందీ పండిట్ పోస్టులు నాలుగు, బయోలజికల్ సైన్స్ పోస్టులు 8, సోషల్ టీచర్ల పోస్టులు 4, పీడీ పోస్టు ఖాళీగా ఉన్నాయి. బొమ్మినంపాడు, పెదగొన్నూరు, ముదినేపల్లి, గురజ, వడాలి, వైవాక, అల్లూరు, చిగురుకోట హైస్కూళ్లలో ఉపాధ్యాయ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ కాలేదు. నూతనంగా యూపీ నుంచి హైస్కూలుకు అప్‌గ్రేడ్ అయిన వైవాక హైస్కూల్‌లో నాలుగు టీచర్ల పోస్టులను విద్యాశాఖ మంజూరు చేయలేదు. అన్ని హైస్కూళ్లలో ముఖ్యమైన బయోలాజికల్ సైన్స్ పోస్టులు ఖాళీగానే ఉండిపోయాయి. బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో కౌన్సెలింగ్‌లో ఎవరూ కోరుకోలేదు. ఎఫ్ఏ-1 పరీక్షలు దగ్గర పడుతున్న పరిస్థితుల్లో ఉపాధ్యాయులు లేక పలు సబ్జెక్టు బోధన కుంటుపడింది. ఇతర పాఠశాలల నుంచి ఈ హైస్కూళ్లకు టీచర్లను డిప్యుటేషన్‌పై పంపే అవకాశం లేదు. దీంతో విద్యార్థులకు బోధన అగమ్యగోచరంగా మారింది. పని సర్దుబాటుకు కూడా అవకాశం లేకపోవటంతో డీఎస్సీ నియామకాలు పూర్తయ్యే వరకు హైస్కూళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ అయ్యే అవకాశాలు లేవని విద్యాశాఖ అధికారులే చెబుతున్నారు.



ముదినేపల్లిలోని హైస్కూలు

విద్యార్థులేరీ?

ఒకటో తరగతిలో చేరని విద్యార్థులు

వైవాక మండల పరిషత్ పాఠశాల పరిస్థితి ఇది

ముదినేపల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైవాక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఈ విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిలో విద్యార్థులే కరువయ్యారు. 2025-26 విద్యాసంవత్సరానికి ఈ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కూడా బడి ఈడు పిల్లలు లేకపోవటంతో ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేరే విద్యార్థులే కరువయ్యారు. ఈ ఏడాది ఒకటో తరగతిలో విద్యార్థులు లేకపోవటంతో వచ్చే విద్యా సంవత్సరంలో రెండో తరగతిలో కూడా విద్యార్థులు ఉండరనేది స్పష్టమవుతున్నది. ఇంతకు ముందు ఈ పాఠశాల యూపీ స్కూలుగా ఉండేది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఈ స్కూలును హైస్కూలుగా అప్ గ్రేడ్ చేశారు. దీంతో ప్రాథమిక పాఠశాల, హైస్కూలుగా ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం నూతన హైస్కూల్‌లో విద్యార్థులు చేరినప్పటికీ, ప్రాథమిక పాఠశాలలో ప్రారంభ తరగతి అయిన ఒకటో తరగతి లేకుండా పోయింది.

రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే కూటమి లక్ష్యం

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి

ఆప్కాబ్ ఛైర్మన్ గన్నితో కలిసి ప్రారంభోత్సవాలు

చాట్రాయి, జూలై 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి దేశంలో అగ్రగామిగా నిలపటమే కూటమి సర్కార్ లక్ష్యమని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని చిత్తపూరులో రక్షిత మంచినీటి పథకం, తుమ్మగూడెంలో పీఏసీఎస్ పెట్రోల్ బంకు, ఎన్టీఆర్, దివంగత టీడీపీ నేత కొల్లి మాధవరావు విగ్రహాలు, పోలవరంలో పీఏసీఎస్ పెట్రోల్ బంకు, ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆదివారం ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురామ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, ఏడాదికి రూ. 34 వేల కోట్లు పెన్షన్లకే ఖర్చు చేస్తున్నామని, దేశంలో రూ. 4 వేలు పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అన్నారు. సీఎం చంద్రబాబు పారిశ్రామికవేత్తలను ఒప్పించి రూ. 8 లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చి కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని, వచ్చే నాలుగేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. కౌలు రైతులకు, వ్యవసాయ అనుబంధ రంగాలకు, చేతివృత్తుల వారికి పీఏసీఎస్‌ల నుంచి రుణాలు ఇవ్వాలని కోరారు. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని ఆంజనేయులు మాట్లాడుతూ పీఏసీఎస్‌లను పూర్తిగా కంప్యూటరీకరణ చేశామని, రైతు దరఖాస్తు చేసిన 15 నిమిషాలలో రుణాలు మంజూరు చేసే ఏర్పాటు చేశామని, గతంలో రుణాల మంజూరుకు తీవ్ర జాప్యం జరిగేదని ఇక ఆ పరిస్థితి ఉండదన్నారు. కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ పీఏసీఎస్‌లను ఆర్థికంగా బలోపేతం చేయటం కోసం పెట్రోల్ బంకులు ఇతర వ్యాపారాల ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నామని, వచ్చే లాభాలతో రైతులకు తక్కువ వడ్డీపై రుణాలివ్వటానికి అవకాశం ఉంటుందని అన్నారు. చిత్తపూరులో సీఎంఆర్ఎఫ్ కింద రూ. 2 లక్షల చెక్కులను నలుగురు లబ్ధిదారులకు అందజేశారు. జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఎ. శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షులు దామెర చిట్టిబాబు, యర్రా ప్రసాద్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్, కొల్లి మాధవరావు విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా 5న వామపక్షాల ధర్నా

నూజివీడు టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోకుంటే విద్యుత్ పోరాటం నిర్వహిస్తామని వామపక్ష పార్టీల నేతలు హెచ్చరించారు. ఆదివారం నూజివీడులో సీపీఐ నియోజకవర్గ సమితి కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ అధ్యక్షతన జరిగిన వామపక్షాల సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి నాయకుడు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ ఆగస్టు 5న విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటును వ్యతిరేకిస్తూ సబ్ స్టేషన్ల వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొనాలని కోరారు. సీపీఐ (ఎంఎల్ లిబరేషన్) జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు, సీపీఎం జిల్లా నాయకుడు జి రాజు, సీపీఐ (ఎంఎల్ న్యూ డెమొక్రసీ) నాయకుడు నాగరాజు, సీపీఐ నాయకులు చెంగల వెంకటేశ్వరరావు, యాదాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పీ-4 లక్ష్యాలపై దృష్టి పెట్టాలి: మంత్రి

నూజివీడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 పథకం లక్ష్యాలు నూజివీడు నియోజకవర్గంలో త్వరితగతిన పూర్తి కావాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈ మేరకు విజయవాడలోని తన కార్యాలయంలో నూజివీడు నియోజకవర్గ మండల అభివృద్ధి అధికారులు, సంబంధిత అధికారులతో జరిపిన సమీక్ష సమావేశంలో స్పష్టం చేశారు. నియోజకవర్గంలో బంగారు కుటుంబాలు, గ్రామాలను దత్తత తీసుకున్న వారి వివరాలను ఇప్పటి వరకు ఈ లక్ష్యంపై జరిగిన అభివృద్ధి అమలు జరిగిన తీరుపై అధికారులు నివేదిక సమర్పించాలని కోరారు.

రెడ్డియ్య కుటుంబానికి పరామర్శ

ముసునూరు: టీడీపీ బూత్ కన్వీనర్ బల్లవరపు రెడ్డియ్య కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గోపవరం ఎస్సీకాలనీకి చెందిన బూత్ కన్వీనర్ రెడ్డియ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆదివారం టీడీపీ గ్రామ అధ్యక్షులు ఉప్పలపాటి గణేష్‌తో కలిసి మంత్రి రెడ్డియ్య కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ ఒక నిబద్ధత గల యువ నాయకుడిని కోల్పోయిందని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యాకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ కన్వీనర్‌గా శ్రీనివాస్

ముసునూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మండల కన్వీనర్‌గా కొడవలి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం ముసునూరులో జిల్లా నాయకుడు రాజు ఆధ్వర్యంలో సీఐటీయూ మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కన్వీనర్‌గా శ్రీనివాస్, కో-కన్వీనర్లుగా కె.కనకదుర్గ, కె.విద్యావతితోపాటు మరో ఏడుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అన్ని రంగాల కార్మికుల సమస్యలపై మండల కమిటీ పోరాడాలని రాజు కోరారు.

కలాం ఆశయాలు మహోన్నతం

కైకలూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): అబ్దుల్ కలాం ఆశయాలు మహోన్నతమైనవని ఆయన చెప్పినట్లుగా ప్రతి ఒక్కరూ కలలు కని వాటిని సాకారం చేసుకోవాలని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి అన్నారు. ఆదివారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా కైకలూరు పంచాయతీ కార్యాలయంలోని కలాం విగ్రహానికి టీడీపీ నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కలాం సూచనలు అనుసరణీయమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, డీసీ ఛైర్మన్ పొత్తూరి వాసురాజు, మైనార్టీ నాయకులు ఎండీ జానీ, సయ్యద్ బషీర్, సయ్యద్ బాషీద్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పి. రాధాకృష్ణ, పట్టణ అధ్యక్షుడు పడమటి వాసు, తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో కలాంకు టీడీపీ నేతల నివాళి

కలిదిండి: మట్టగుంటలో కూటమి నాయకులు ఆదివారం కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షుడు నాగిడి వీరబ్రహ్మం, నాయకులు ఈశ్వర పరశురాముడు, కొప్పనాతి శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ శుభశేఖర్

హెల్మెట్ తప్పక ధరించాలి: ఎస్ఐ

ఆగిరిపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పక ధరించాలని ఎస్ఐ శుభశేఖర్ అన్నారు. మద్యం తాగి వాహనం నడపడం, అలాగే మైనర్లు వాహనాలు నడపడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటాయని అన్నారు. ఆదివారం నాడు పలు వాహనాలను ఆపి వాహన సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం రాంగ్ రూట్లో వాహనం నడపడం, వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ లేకపోతే వారిపై జరిమానాలు తప్పవని హెచ్చరించారు.



కరపత్రాలు అందజేస్తున్న ఆరేపల్లి

తోటపల్లిలో సుపరిపాలన

ఆగిరిపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆలోచనలకు అనుగుణంగా కూటమి పాలన సాగుతోందని టీడీపీ నూజివీడు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు అన్నారు. తోటపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. తోటపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు పరిమి శోభనాద్రి, క్లస్టర్ ఇన్‌చార్జి సునీల్‌వర్మ, ఆరేపల్లి సాయికృష్ణ, మొక్కపాటి సాహితి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సెంటర్ మార్పు దుర్మార్గం

అభ్యర్థుల నిరసన

పెనుగొండ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ముందస్తు సమాచారం లేకుండా పరీక్ష సెంటర్‌ను మార్పు చేయడం దుర్మార్గమని, తక్షణమే న్యాయం చేయాలని ఎయిడెడ్ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు డిమాండ్ చేశారు. పెనుగొండ ఎస్వీకేపీ సైన్స్ జూనియర్ కళాశాలలో ఆదివారం జరగాల్సిన ఏడు ఎయిడెడ్ పోస్టుల భర్తీ పరీక్షను నిలిపి వేయడంతో అభ్యర్థులు ఆందోళన చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఈ సెంటర్‌కు 20 మంది పరీక్షను రాసేందుకు అభ్యర్థులు పెనుగొండ సెంటర్‌కు వచ్చారు. ఇక్కడకు వచ్చని అభ్యర్థులకు పరీక్ష సెంటర్ ఇక్కడ కాదని తాడేపల్లిగూడెం, భీమవరం సెంటర్లకు మార్పు చేశామని చెప్పడంతో అభ్యర్థులు అవాక్కయ్యారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇప్పటికిప్పుడు మార్పు చేశామని చెప్పడం ఏమిటని సెంటర్ వద్ద కొంతసేపు నిరసన తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి పేపర్ ప్రకటన ఇచ్చామని, ఆదివారం ఉదయం వచ్చిందని చెప్పడంతో అప్పటికపుడు ప్రకటన చేయడం ఏమిటని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షకు సంబంధించి ఎగ్జామ్ సెంటర్ వద్ద అభ్యర్థుల హాల్ టిక్కెట్లతో కూడిన బోర్డును ఏర్పాటు చేశారు. పరీక్షను వాయిదా వేశామని ఫ్లెక్సీని ఏర్పాటు చేసి, మరో రెండు చోట్ల పరీక్షలు నిర్వహించడం తగదన్నారు. ఎయిడెడ్ పోస్టులకు కాంట్రాక్టుగా చేసిన తరువాత పర్మినెంట్ చేస్తామని కాల్ లెటర్‌లో పేర్కొన్నారని, ఎంతో కష్టపడి చదివి పరీక్షకు వస్తే ఈ విధంగా మార్పు చేయడం తగదని పైగా తాడేపల్లిగూడెం, భీమవరం సెంటర్‌లలో ఉదయం 9.30 గంటలకే పరీక్ష నిర్వహిస్తే ఏవిధంగా సెంటర్‌లకు వెళ్లి రాయడం సాధ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరీక్ష సెంటర్ మార్పు పలు అనుమానాలకు తావిస్తుందన్నారు.

కాలేజీకి చేరని సమాచారం

పెనుగొండ ఎస్వీకేపీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించే ఎయిడెడ్ పరీక్షలకు సంబంధించి ఎటువంటి సమాచారం అందకపోవడం విడ్డూరం. పరీక్షా కేంద్రంలో యథావిధిగా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులలో కొందరు మూడు పోస్టులకు దరఖాస్తు చేసుకోవడంతో దీనికి అనుగుణంగా మూడు స్లాట్‌లలో పరీక్షలు ఏర్పాట్లు చేశారు. పరీక్షా సమయం కావస్తున్నా విద్యాశాఖాధికారులు రాకపోవడంతో అనుమానం వచ్చి సంప్రదిస్తే పరీక్షా కేంద్రం మార్పు చేసినట్టు చెప్పారు. అప్పటికే పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు చేరడంతో వారు డీలా పడిపోయారు. ముందస్తు సమాచారం అందించకుండా మార్పు ఎలా చేశారంటూ నిరసన తెలిపారు.



పెద్దఎడ్లగాడి వంతెన ఎగువ భాగాన దట్టంగా అలుముకున్న తూడు, గుర్రపుడెక్క, కిక్కిస

ఆక్రమణలు.. అడ్డంకులు!

(5వ పేజీ తరువాయి)

నాలుగు అడుగులు ఖాళీ మాత్రమే ఉంది. దీంతో నీరు దిగువకు పారుదల అయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. చిన్నఎడ్లగాడి వంతెనకు దిగువ భాగాన కిక్కిసక్రర దట్టంగా అలుముకు పోయింది. పెద్దఎడ్లగాడి వంతెన ఎగువ భాగాన గుర్రపు డెక్క, తూడు దట్టంగా పేరుకుపోయింది. కొల్లేరుకు వరద వస్తే ఎగువన ఉన్న మండవల్లి మండలంలోని పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, మణుగులూరు తదితర గ్రామాలకు ముంపునకు గురవుతాయి.

విజయవాడకు ముంపే..

ఉప్పుటేరు ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించకపోతే ఏటా బుడమేరు నుంచి వచ్చే వరద నీటి ప్రవాహానికి అవరోధం కలుగుతుంది. దీంతో ఎగువన ఉన్న విజయ వాడతో పాటు పలు గ్రామాలు సైతం జలదిగ్బంధానికి గురయ్యే పరిస్థితులు ఉన్నాయి. గతేడాది వర్షాకాలంలో బుడమేరు ఉధృతంగా ప్రవహించడంతో విజయవాడ పరిసర ప్రాంత గ్రామాలు ముంపు బారిన పడిన సంగతి తెలిసిందే. బుడమేరుకు ప్రధాన మార్గమైన కొల్లేరు, ఉప్పుటేరు ఆక్రమణలను చెత్తాచెదారాలను తొలగించకపోతే మరలా విజయవాడ ముంపునకు గురయ్యే పరిస్థితులు పునరావృతం అవుతుందని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

పంటల బీమాకు దరఖాస్తులు అంతంతే!

(5వ పేజీ తరువాయి)

రైతుల పథకంలో నమోదు చేయడానికి అవసరమైన పత్రాలు తీసుకుని సమీపంలో ఉన్న కామన్ సర్వీస్ సెంటర్ (మీసేవా కేంద్రం), పోస్టాఫీసు, గ్రామ సచివాలయంలో సంప్రదించి గడువు తేదీలోగా ప్రీమియం నగదు చెల్లించి తమ వివరాలు నమోదు చేసుకోవాలి. ఇతర వివరాలకు సమీపంలో ఉన్న బ్యాంకు శాఖ, సంబంధిత వ్యవసాయ శాఖాధికారిని, సంబంధిత బీమా కంపెనీల ప్రతినిధులను సంప్రదించవచ్చు.

ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఎల్ఎస్ భాస్కరరావు

మండవల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలు మరింత అవగాహన పెంచుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.ఎస్. భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి. అప్పారావు పేర్కొన్నారు. మండవల్లిలో ఆదివారం జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఐక్యవేదిక సభ్యులు గ్రామాల్లోకి వెళ్లి సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజలకు ప్రజాస్వామ్యంపై, రాజ్యాంగంపై అవగాహన పెంచాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం బోర్డులు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సక్రమంగా లేకపోవడం, అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు గంజాల శ్రీనివాసరావు, వై శ్రీనివాసరావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి మానవత ఆర్థిక సాయం



మండవల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మానవత మండవల్లి శాఖ అధ్యక్షుడు గుడివాడ గణేష్ ఆధ్వర్యంలో మండవల్లి దళితవాడకు చెందిన పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందించారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువు తున్న కడిమి అఖిల్‌కు మానవత ఆధ్వర్యంలో పుస్తకాలు, బ్యాగు, కళాశాల ఫీజు నిమిత్తం రూ.6200 అందజేశారు. విద్యార్థి ఉన్నత చదువుకు మానవత ఆధ్వర్యంలో అండగా ఉంటామని ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్ భరోసా ఇచ్చారు. అనంతరం పేద మహిళ గుడివాడ లక్ష్మికి నెలవారి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సభ్యులు పాల్గొన్నారు.

సిలిండర్ నుంచి మంటలు..

కైకలూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలంలోని తామరకొల్లు గ్రామానికి చెందిన నున్న మంగరాజు ఫూరింట్లో ఆదివారం సాయంత్రం వంట చేసేందుకు గ్యాస్ స్టవ్ వెలిగించగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో సిలిండర్‌ను ఇంటి నుంచి బయటకు తీసుకువచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని చేరుకుని మంటలను అదుపు చేశారు. సమయస్ఫూర్తితో మంట లు వ్యాపించిన సిలిండర్‌ను ఇంటి నుండి బయటకు తీసుకురావడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ముదినేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెదగొన్నూరులో ఈనెల 23వ తేదీ రాత్రి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శ్రవణం పూర్ణచంద్రరావును వెంబడించి అతని కారును ధ్వంసం చేసిన ఘటనలో ముగ్గురు వ్యక్తులపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన జి. శివ రామకృష్ణ, జి. సురేష్, సీహెచ్ నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.